# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

5.4.2026 ఆదివారం Sunday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 254 | పేజీలు : 12 Pages : 12 | వెల రూ.2.00 | Published from : Hyderabad Circulated to : Telangana









# బాసర మాస్టర్ ప్లాన్‌కు గ్రీన్ సిగ్నల్

## రూ.225 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి


- ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నిర్మాణాలు
- 6న బాసర ఆలయ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన
- అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించిన రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 4:** బాసర ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 6న బాసర సరస్వతి ఆలయం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. సుమారు రూ. 225 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. బాసర ఆలయ అభివృద్ధికి మిగతా 3 లో

సింగరేణి కార్మికులకు

# శుభవార్త

సహజ మరణానికి పదిలక్షల బీమా



3

ఓటు వేయడానికి వెళ్లేవారికి

# స్పెషల్ లీవ్

- రాష్ట్రేతర ఓటర్లకు తెలంగాణ సర్కార్ శుభవార్త
- ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నిర్ణయం



2

ఇబ్రహీంపట్నం, క్యాతన్‌పల్లి

# బీఆర్ఎస్ కైవసం

ఇబ్రహీంపట్నం ఛైర్మన్‌గా సుదర్శన్ రెడ్డి ఎన్నిక

క్యాతన్ పల్లి పీఠం దక్కించుకున్న సంధ్యారాణి

ఎన్నిక ప్రక్రియకు దూరంగా ఉన్న కాంగ్రెస్ కౌన్సిలర్లు

బీఆర్ఎస్ కు మద్దతుగా నిలిచిన బీజేపీ, సీపీఐ



## ఖానాపూర్ మున్సిపల్ ఎన్నిక వాయిదా

రణరంగంగా మారిన కార్యాలయం

వివరాలు 3వ పేజీలో

# 6 నుంచి ఆరోగ్య వారోత్సవాలు

వారం రోజుల పాటు భారీ కార్యక్రమాలు!

ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహనే లక్ష్యం

మంత్రి దామోదర రాజనర్సింహ



2

## దివ్యాంగులకు అండగా నిలవాలి

- మీడియా అకాడమీ చైర్మన్



3

# తెలంగాణ సంపద కాంగ్రెస్ పాలు

- ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫండ్ కోసం నిధుల మళ్లింపు
- గ్యారంటీలు, 66 హామీల పేరుతో ప్రజలకు మోసం
- ఎంపీ ఈటల రాజేందర్

.. వివరాలు 2లో



పోలీస్ మామలు గ్రూపునకు

# ఎస్పై షాక్

బెడిసికొట్టిన మందుబాబుల ప్లాన్

వాట్సాప్ గ్రూప్‌తో తనిఖీలపై ముందే హెచ్చరికలు

ట్రాఫిక్ ఎస్ఐ ఎంటర్‌తో దొరికిపోయిన మోసం



.. వివరాలు 3లో

నేను గోదావరిఖని మున్సిపల్ చౌరస్తాలో చెకింగ్ చేస్తున్నాను, దమ్ముంటే రండిరా మామ చూసుకుందాం



మేడారం పూజారి కుమారుడికి

# పరామర్శ

ఘటనకు మంత్రులదే బాధ్యతన్న మధుసూధనాచారి

2

# కేసీఆర్ క్యాంప్ ఆఫీసుపై దాడి!

- క్షీణిస్తున్న శాంతిభద్రతలకు నిదర్శనం
- మండిపడ్డ బీఆర్ఎస్ నేతలు

3





## పొంగులేటి మైనింగ్ స్కామ్ దృష్టి మళ్లింపు

అందుకే నాపై సీఐడీ విచారణ

పాడి కౌశిక్ రెడ్డి

.. వివరాలు 2లో

# కేరళలో ఎల్‌డీఎఫ్‌కు ఉద్వాసన



బీజేపీ విజయం ఖాయం

దక్షిణాది రాష్ట్రాల సీట్ల తగ్గింపుపై జరుగుతున్న ప్రచారంలో నిజం లేదు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

రాబోయే పదేళ్లలో స్టార్టప్స్, టెక్ విభా గాల్లో ప్రపంచ అగ్రగామిగా భారత్‌ను నిలపడమే లక్ష్యమని ప్రధాని మోదీ వెల్లడించారు. ఈ లక్ష్యం దిశగా భారతీయ స్టార్టప్‌లు వైవిధ్యంతో, సాహసోపేతంగా పురోగమి స్తాయనే పూర్తి విశ్వాసం తనకు ఉందన్నారు. ప్రస్తుత తరుణంలో ఆర్టిఫిషియల్ ఇంటెలీజెన్స్ (ఏఐ) టెక్నాలజీపై భవిష్యత్ వ్యూహాన్ని కలిగిన దేశాలకే ఎక్కువ ప్రయో జనాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు.



## హర్మూజ్ దాటిన 'గ్రీన్ శాన్వీ'

స్పందించిన ఇరాన్


4

# ఉగ్రకుట్ర భగ్నం

- నలుగురు ఉగ్రవాదుల అరెస్టు..

దేశంలో భారీ పేలుళ్ల ఉగ్రకుట్రను ఉత్తర్ ప్రదేశ్ పోలీసులు భగ్నం చేశారు. పేలుళ్లకు ప్రణాళికలు రచించిన నలుగురు నిందితులు సాకిబ్ అలియాస్ డెవిల్, వికాస్ గెహ్లావత్ అలియాస్ రౌనక్, లోకేశ్ అలియాస్ పాప్లా పండిట్ అలియాస్ బాబు అలియాస్ సంజు, అర్బాబ్‌ను ఉత్తర ప్రదేశ్ ఉగ్రవాద నిరోధక దళం(ఏటీఎస్) అరెస్టు చేసింది. వారికి పాక్ ఉగ్ర సంస్థలతో సంబంధాలు ఉన్నట్లు విచారణలో తేలింది.

4





# 6 నుంచి ఆరోగ్య వారోత్సవాలు

## వారం రోజుల పాటు భారీ కార్యక్రమాలు!

### ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహనే లక్ష్యం : మంత్రి దామోదర

**హైదరాబాద్, ఏప్రిల్ 04:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా 'హెల్త్ వీక్' (ఆరోగ్య వారోత్సవాలు) నిర్వహించనున్నారు. ఈ వారోత్సవాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శనివారం ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించేలా ఈ వేడుకలు ఉండాలని మంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ వారోత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ ఒక ప్రత్యేక అంశంపై కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఏప్రిల్ 6న 'ఫుడ్ సేఫ్టీ ఫోకస్ డే' సందర్భంగా ఉదయం నెక్లెస్ రోడ్ లో 'ఈట్ రైట్ వాక్', మధ్యాహ్నం నేచురోపతి ఆస్పత్రిలో మిల్లెట్ మేళా ఏర్పాటు చేస్తారు. ఆహార నిపుణులకు శిక్షణతో పాటు వీధి వ్యాపారులకు సర్టిఫికేట్ల పంపిణీ చేపడతారు. ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం వేళ నిమ్స్ లో అత్యాధునిక 'లీనాక్' యంత్రాన్ని మంత్రి ప్రారంభించనున్నారు. అదే రోజు రవీంద్రభారతిలో తెలంగాణ క్యాన్సర్ రిజిస్ట్రీ, ట్రామా కేర్ పాలసీని అందుబాటులోకి తెస్తూ.. కొత్తగా ఎంపికైన 871 మంది డాక్టర్లకు నియామక పత్రాలు అందజేస్తారు. ఏప్రిల్ 8న 'సేఫ్ మదర్ డే' నిర్వహిస్తూ గర్భిణులకు ఏఎన్ సీ పరీక్షలు, ప్రసూతి సేవలపై గ్రామస్థాయిలో మహిళలకు అవగాహన కల్పిస్తారు. ఏప్రిల్ 9న ఎయిడ్స్ పై అవగాహన కోసం హైదరాబాద్ లో 'రెడ్ రన్', జైళ్లలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఉంటాయి. ఏప్రిల్ 10న 'హోమియోపతి, ఆయుష్ డే' సందర్భంగా ఉదయం యోగా ప్రదర్శనలు, హోమియోపతి కళాశాలలో రాష్ట్ర స్థాయి సెమినార్ నిర్వహిస్తారు. వారోత్సవాల ముగింపు రోజైన ఏప్రిల్ 11న 'డ్రగ్ కంట్రోల్ డే' పాటిస్తూ మందుల సురక్షిత వాడకంపై అవగాహన, గాంధీ ఆస్పత్రిలో డీ అడిక్షన్ క్యాంప్ ఏర్పాటు చేస్తారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు కూడా నిర్వహిస్తారు. రాష్ట్ర ఆరోగ్య రంగ అభివృద్ధికి ఈ కార్యక్రమాలు దోహదపడాలని మంత్రి సూచించారు. విద్యార్థులు, మహిళలు, యువతను ఈ వారోత్సవాల్లో పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల సమన్వయంతో హెల్త్ వీక్ ను విజయవంతం చేయాలని కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, కమిషనర్ సంగీత సత్యనారాయణ, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీంద్ర నాయక్ తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మేడారం పూజారి కుమారుడికి పరామర్శ

## ఘటనకు మంత్రులదే బాధ్యతన్న మధుసూధనాచారి



**వరంగల్, ఏప్రిల్ 4:** మేడారం గద్దెల వద్ద గతనెల 25న జరిగిన ప్రమాదానికి మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ బాధ్యత వహించి తమ పదవులకు రాజీనామా చేయాలని తెలంగాణ శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి , ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి డిమాండ్ చేశారు. హన్మకొండలో ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న సమ్మక్క పూజారి కుమారుడు యువన్‌ను వారు పరామర్శించారు. బాలుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా బాలుడికి తీవ్ర నష్టం జరిగిందని తెలిపారు. మంత్రి సీతక్క వచ్చి పరామర్శించి రూ. 10వేలు చేతిలో పెట్టి వెళ్లి ఇప్పటి వరకు పట్టించుకోలేదని ఆరోపించారు. మంత్రులు ఇప్పటివరకు బాలుడిని ఆదుకునేందుకు ముందుకు రాకపోవడంపై అగ్రహం వ్యక్తం చేశారు. బాలుడికి అయ్యే వైద్య ఖర్చులన్నీ ప్రభుత్వమే భరించి, అతడి భవిష్యత్ కోసం కోటి రూపాయలు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. బాధితుడి తల్లిదండ్రులకు ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

# పొంగులేటి స్కామ్ దృష్టి మళ్లింపు

## అందుకే తనపై సీఐడీ విచారణ : ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 4:** ఇటీవల హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పోలీసు విధులకు భంగం కలిగించడం, రెచ్చగొట్టే వాఖ్యలు చేసిన కేసులో.. కౌశిక్ రెడ్డి శనివారం సీఐడీ అధికారుల ఎదుట హాజరయ్యారు. విచారణ అనంతరం ప్రభుత్వం, పోలీసులపై పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. తనను, తన కుటుంబాన్ని రాజకీయంగా వేధించడానికి ఈ విచారణలు జరుపుతున్నారని ఆరోపించారు. సీఐడీ కార్యాలయం వెలుపల మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన, ప్రస్తుత పరిణామాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. 'నేను అనని మాటలు అన్నట్లుగా చిత్రీకరిస్తున్నారు. పొంగులేటి మైనింగ్ స్కామ్ నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే నాపై ఎథిక్స్ కమిటీ వేశారు. ప్రజల పక్షాన పోరాడటానికి నేను దేనికైనా సిద్ధం. హుజూరాబాద్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటును ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. కరీంనగర్ జిల్లా చెత్తనంతా తెచ్చి హుజూరాబాద్‌లో వేస్తే ఊరుకోం. ఆ డంపింగ్ యార్డ్ కరోనా కంటే ప్రమాదం. ఈ విషయంలో నేను చేస్తున్న పోరాటాన్ని అణచివేయడానికి విచారణ పేరుతో అడ్డుకుంటున్నారు. ఈ నెల 7వ తేదీన హుజూరాబాద్‌లో దీక్షకు కూర్చుంటా. నేను మత మార్పిడిలపై వ్యాఖ్యలు చేసినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తా' అని అన్నారు.

# కేసీఆర్ క్యాంప్ ఆఫీసుపై దాడి.. రేవంత్ ఆదేశమే

- గజ్వేల్ ఎమ్మెల్యే కార్యాలయంపై కాంగ్రెస్ గూండాల వీరంగం
- బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు
- బీహార్ గ్యాంగ్ సంస్కృతిని తలపిస్తోందని మండిపాటు
- ఇందిరమ్మ రాజ్యమా.. గూండా రాజ్యమా అని నిలదీత
- నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డీజీపీకి డిమాండ్



**హైదరాబాద్, ఏప్రిల్ 04 (మనసులో మాట):** ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ గూండాల దాడిని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. ఇది ముమ్మాటికీ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో జరిగిన దాడి అని, ప్రజాస్వామ్యంపై సీఎం చేయించిన దాడి అని ఆరోపించారు. పట్టపగలు అధికార మదంతో విర్రవీగుతూ సోయి మరచి వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నాయకుల తీరు బీహార్ గ్యాంగ్ ను తలపిస్తోందని మండిపడ్డారు. ప్రజాప్రతినిధుల క్యాంపు కార్యాలయాలపైనే ముప్పేట దాడులు జరుగుతుంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నట్లా లేనట్లా అని ప్రశ్నించారు.

### ప్రైవేట్ సైన్యంలా పోలీసులు

శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసు యంత్రాంగం కాంగ్రెస్ పార్టీకి ప్రైవేట్ సైన్యంలా మారిపోయారా అని హరీష్ రావు నిలదీశారు. కాంగ్రెస్ పాలనలో ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాలు, మీడియాపై దాడులు నిత్యకృత్యం కావడం సిగ్గుచేటన్నారు. ఒకవైపు 'హేట్ స్పీచ్ బిల్' పేరుతో ప్రజలు, ప్రతిపక్షాల నోళ్లు మూయిస్తూ.. మరోవైపు కాంగ్రెస్ గూండాలతో దాడులు చేయించడమేనా మీ ప్రజాపాలన అని ధ్వజమెత్తారు. ఇందిరమ్మ రాజ్యమని చెబుతూ గూండా రాజ్యాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు.

### పాలన గాలికి.. పర్యటనలే ముఖ్యం

ముఖ్యమంత్రి, మంత్రులు ఇతర రాష్ట్రాల్లో పొలిటికల్ టూర్లు చేస్తూ పాలనను గాలికి వదిలేశారని హరీష్ రావు ఆరోపించారు. సీఎం, మంత్రులు ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో ఉంటే ఇక్కడ పాలనను ఎవరు చూస్తారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కార్యాలయాలపై దాడులు చేయాలని కాంగ్రెస్ నాయకులకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చారా అని అనుమానం వ్యక్తం చేశారు. ఏడవ గ్యారంటీగా ప్రజాస్వామ్య పునరుద్ధరణ అని డబ్బా కొట్టి.. ఇప్పుడు ఉన్న ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని దుయ్యబట్టారు. ఎమర్జెన్సీ పాలనను తలపిస్తున్న ఈ అణచివేతలకు, నిర్బంధాలకు బీఆర్ఎస్ పార్టీ అదరదు, బెదరదని స్పష్టం చేశారు.

### నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి చేసిన కాంగ్రెస్ గూండాలను గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని రాష్ట్ర డీజీపీని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు ఆపకపోతే ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజలే వీధుల్లోకి రావాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ను అడుగడుగునా నిలదీస్తామని, ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తామని వివరించారు.

# తెలంగాణ సంపద కాంగ్రెస్ పాలు

- ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫండ్ కోసం నిధుల మళ్లింపు
- ఆరు గ్యారంటీలు, 66 హామీల పేరుతో ప్రజలకు మోసం
- ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లింపుల్లో తీవ్ర జాప్యం
- ప్రజా సమస్యలు వదిలి వ్యక్తిగత దూషణలకే ప్రాధాన్యం
- ఎంపీ ఈటల రాజేందర్



**వరంగల్, ఏప్రిల్ 04 (మనసులో మాట):** తెలంగాణ ప్రజల సంపదను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొల్లగొడుతున్నారని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఖర్చుల కోసం ఇక్కడి నిధులను కాంగ్రెస్ పార్టీకి తరలిస్తున్నారని మండిపడ్డారు. శనివారం వరంగల్ లో మీడియాతో మాట్లాడిన ఆయన.. సీఎం రేవంత్ రెడ్డి తీరుపై నిప్పులు చెరిగారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలు, 66 హామీల పేరుతో ప్రజలను నమ్మించి వంచించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటం

గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 నుంచి ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు పెట్టిందని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ ఈ రెండున్నరేళ్లలో కేవలం 600 కోట్ల రూపాయలు మాత్రమే విడుదల చేసిందని ఈటల ధ్వజమెత్తారు. పేద విద్యార్థుల భవిష్యత్తుతో రేవంత్ రెడ్డి సర్కార్ చెలగాటం ఆడుతోందని మండిపడ్డారు. చట్ట సభల్లో ప్రజా సమస్యల గురించి చర్చించకుండా కేవలం వ్యక్తిగత దూషణలతో సమయాన్ని వృథా చేస్తున్నారని విమర్శించారు. హామీల అమలు సాధ్యమా అని అడిగితే.. చేసి చూపిస్తానని ప్రగల్భాలు పలికిన రేవంత్, ఇప్పుడు హామీలు అమలు చేయకుండానే ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

### భూముల విక్రయాలపై సంచలన ఆరోపణలు

వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రైవేట్ వ్యక్తులతో చేతులు కలిపి అమ్ముకుంటున్నారని ఈటల రాజేందర్ సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్ర ప్రజలు గంపెడు ఆశలతో అధికారం ఇస్తే.. రేవంత్ మాత్రం తెలంగాణ ఆస్తులను కొల్లగొడుతున్నారని దుయ్యబట్టారు. ఫీజు రీయింబర్స్ మెంట్ తో పాటు ఇతర సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రేవంత్ రెడ్డి వెంటనే తన ధోరణిని మార్చుకోవాలని, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని డిమాండ్ చేశారు.

# దివ్యాంగులకు అండగా నిలవాలి

- మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి
- మానవ సేవే మాధవ సేవగా కృషి చేయాలి
- వైభవంగా మేధో దివ్యాంగుల పాఠశాల 36వ వార్షికోత్సవం
- పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం
- సీఎం రేవంత్ రెడ్డిని పాఠశాలకు ఆహ్వానిస్తాం
- స్వయం ఉపాధితో రాణిస్తున్న విద్యార్థులు



**కరీంనగర్, ఏప్రిల్ 4 :**

మానవ సేవే మాధవ సేవ అని, మానసిక శారీరక వైకల్యం కలిగిన విద్యార్థులకు సేవ చేయడం వల్ల గొప్ప ఆత్మ సంతృప్తి కలుగుతుందని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి అన్నారు. తిమ్మాపూర్ మండలం ఎల్ ఎండీ కాలనీ మహాత్మా నగర్ లోని స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మేధో దివ్యాంగుల ప్రత్యేక పాఠశాల 36వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

### సిబ్బంది సేవలు వెలకట్టలేనివి


జన్యు లోపాలతో మేధోపరమైన వెనుకబాటుతనం ఉన్న పిల్లల కోసం స్వాతంత్ర్య సమరయోధులు ముందుచూపుతో ఈ పాఠశాల ఏర్పాటు చేయడం అభినందనీయమని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కేవీ నర్సింగరావు కృషితో వెలసిన ఈ పాఠశాల చుట్టుపక్కల ప్రాంతాలకు ఒక దేవాలయం వంటిదని కొనియాడారు. మానసిక వైకల్యం ఉన్న పిల్లలను కన్నబిడ్డల్లా చూసుకుంటున్న టీచర్లు, ఆయాలు, సిబ్బందిని దేవుళ్లుగా ఆయన అభివర్ణించారు. చాడ వెంకట్ రెడ్డి తనకున్న పరిచయాలతో ఈ సంస్థను మరింత అభివృద్ధి చేస్తున్నారని ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ. 50 లక్షలు కేటాయించిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి ఈ పాఠశాల సమస్యలను తీసుకెళ్లి ఆయన ఇక్కడికి వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్వయం ఉపాధితో రోజుకు రూ. 500 సంపాదిస్తున్న విద్యార్థిని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు.

### అభివృద్ధి పథంలో పాఠశాల

ట్రస్ట్ చైర్మన్ చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. 1990లో 20 మందితో ప్రారంభమైన ఈ పాఠశాల నేడు 127 మందికి ఆశ్రయం కల్పిస్తోందని తెలిపారు. ఎస్సారెస్పీ అధికారులతో మాట్లాడి రెండు ఎకరాల భూమి కేటాయించామని, తన ఎమ్మెల్యే నిధుల నుంచి రూ. 25 లక్షలతో భవనాలు నిర్మించామని గుర్తు చేశారు. ఐఏఎస్ అధికారిణి అనిత రామచంద్రన్ చొరవతో రూ. 26 లక్షల విలువైన బస్సు లభించిందని వివరించారు. నాప్కో సీఈఓ రాజు, ఎల్ వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వంటి దాతల సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. మంత్రులు సీతక్క, లక్ష్మణ్ కుమార్ కూడా పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారని వెల్లడించారు.

### స్వయం ఉపాధిపై ప్రత్యేక దృష్టి

18 ఏళ్లు దాటిన విద్యార్థుల కోసం కొవ్వొత్తులు, విస్తరాకులు, సబ్బుల తయారీ యూనిట్లను ఏర్పాటు చేసినట్లు వెంకట్ రెడ్డి తెలిపారు. విద్యార్థుల స్థితిగతులను బట్టి స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, యోగా వంటి నైపుణ్యాలను నేర్పిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం పాఠశాలలో 77 మంది వసతిగృహంలో ఉండగా, 50 మంది డేస్కాలర్ విద్యార్థులు ఉన్నట్లు వివరించారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు సదానందం గౌడ్ మాట్లాడుతూ ప్రతి జిల్లాలో ఇలాంటి పాఠశాల ఒకటి ఉండాలని కోరారు. ఆర్డీవో మహేశ్వర్ సిబ్బంది కృషిని అభినందించారు. చీఫ్ ఇంజనీర్ సుమతి దేవి ఏటా రూ. 20,000 ఆర్థిక సాయం అందజేస్తానని ప్రకటించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సతీష్, సీనియర్ జర్నలిస్టులు మధుసూదన్ రెడ్డి, శేఖర్, ట్రస్ట్ సభ్యులు వెంకటయ్య, సత్యనారాయణ, అశోక్ పాల్గొన్నారు.



# సింగరేణి కార్మికులకు శుభవార్త

## సహజ మరణానికి పదిలక్షల బీమా

**హైదరాబాద్, ఏప్రిల్ 4:** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కార్మికుల సంక్షేమం దిశగా మరో కీలక అడుగు పడింది. సింగరేణి యాజమాన్యం తీసుకున్న ప్రత్యేక చొరవతో, కార్మికులకు లభించే బీమా సౌకర్యం ఇప్పుడు మరింత విస్తృతమైంది. ఇకపై ప్రమాదవశాత్తు జరిగే మరణాలకే కాకుండా, సహజ మరణానికి కూడా రూ. 10 లక్షల ఉచిత బీమా పథకాన్ని అమలు చేయాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్ణయించింది. సాధారణంగా బ్యాంకులు ప్రమాద బీమాను మాత్రమే అందిస్తుంటాయి. అయితే, సింగరేణి కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని యాజమాన్యం యూనియన్ బ్యాంక్ అధికారులతో జరిపిన చర్చలు సఫలమయ్యాయి. కార్మికులందరికీ జీతాల ఖాతాలు అదే బ్యాంకులో ఉండటంతో, సామాజిక బాధ్యతలో భాగంగా ఈ అదనపు ప్రయోజనాన్ని కల్పించేందుకు బ్యాంక్ అంగీకరించింది.సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులందరికీ ఇది వర్తిస్తుంది. ఈ నూతన బీమా విధానం ఈ నెల 1వ తేదీ నుండే అమలులోకి వచ్చింది. దీని కోసం కార్మికులు ఎటువంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. ఇది పూర్తిగా ఉచితంగా అందించే సేవ. సింగరేణి వంటి కష్టతరమైన వృత్తిలో ఉన్న కార్మికులకు ఈ పథకం పెద్ద అండగా నిలవనుంది. విధి నిర్వహణలో కాకుండా, ఇంటి వద్ద సహజంగా మరణించినా వారి కుటుంబాలకు ఈ 10 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందుతుంది. ఇది కార్మిక కుటుంబాల్లో భరోసాను నింపుతోంది. సింగరేణి చరిత్రలో ఇలా సహజ మరణానికి కూడా భారీ మొత్తంలో బీమా వర్తించడం ఇదే తొలిసారి అని కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. యాజమాన్యం , యూనియన్ బ్యాంక్ తీసుకున్న ఈ నిర్ణయంపై కార్మికుల నుండి ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

# పోలీస్ మామలు గ్రూపునకు ఎస్సై షాక్

## బెడిసికొట్టిన మందుబాబుల ప్లాన్

## వాట్సాప్ గ్రూప్‌తో తనిఖీలపై ముందే హెచ్చరికలు

## ట్రాఫిక్ ఎస్ఐ ఎంటర్‌తో దొరికిపోయిన మోసం




**పెద్దపల్లి, ఏప్రిల్ 4:** డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల నుంచి తప్పించుకునేందుకు మందుబాబులు వేసిన ఒక మాస్టర్ ప్లాన్ డైరెక్టుగా పోలీసులకే దొరికిపోయింది. పోలీసులు ఎక్కడెక్కడ చెకింగ్ చేస్తున్నారో ముందే సమాచారం తెలుసుకునేందుకు వారు ఏకంగా ఒక వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేశారు. అయితే, ఆ గ్రూప్‌లోకి నేరుగా ట్రాఫిక్ ఎస్ఐ ఎంట్రీ ఇవ్వడంతో మందుబాబుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. గోదావరిఖని ప్రాంతంలో కొంతమంది మందుబాబులు కలిసి 'పోలీస్ మామల స్క్వాడ్' పేరుతో ఒక వాట్సాప్ గ్రూప్‌ను ప్రారంభించారు. కేవలం ఇద్దరితో మొదలైన ఈ గ్రూప్, చూస్తూనే వేల మంది సభ్యులకు చేరుకుంది. ఈ గ్రూప్ ప్రధాన ఉద్దేశ్యం ఏమిటంటే.. పట్టణంలో ఎక్కడైనా పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తుంటే, వెంటనే ఆ లొకేషన్ వివరాలను గ్రూప్‌లో షేర్ చేయడం. దీనివల్ల మందుబాబులు ఆ మార్గాల్లో వెళ్లకుండా ప్రత్యామ్నాయ దారులను వెతుక్కుని పోలీసుల కళ్లు గప్పేవారు. ఇటీవల వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఒక వ్యక్తి పోలీసులకు పట్టుబడ్డాడు. అతని సెల్ ఫోన్ తనిఖీ చేయగా ఈ వింత వాట్సాప్ గ్రూప్ వ్యవహారం బయటపడింది. ఆ గ్రూప్‌లోని మెసేజ్‌లను చూసిన స్థానిక ట్రాఫిక్ ఎస్ఐ, వెంటనే అందులో ఒక సెల్ఫీ వీడియోను పోస్ట్ చేశారు. 'అరేయ్ మామ.. నేను ట్రాఫిక్ ఎస్ఐని రా మామ.. నా మీదే గ్రూప్ పెడతారా?' అంటూ గట్టి వార్నింగ్ ఇచ్చారు. 'నేను గోదావరిఖని మున్సిపల్ చౌరస్తాలో చెకింగ్ చేస్తున్నాను, దమ్ముంటే రండిరా మామ చూసుకుందాం' అని సవాల్ విసిరారు.ఆ వీడియోను చూసిన మందుబాబులు ఒక్కసారిగా హడలిపోయారు. వెంటనే గ్రూప్ నుండి లెఫ్ట్ అవ్వడం ప్రారంభించారు. అయితే ఎస్ఐ మాత్రం తగ్గేదేలే అన్నట్లుగా.. 'ఎవరూ వెళ్ళిపోకండి, మీ అందరి నెంబర్లు సేవ్ చేసుకున్నాను, ఫోటోలు కూడా తీశాను. మీ అందరికీ త్వరలోనే ఒక స్పెషల్ అవేర్నెస్ ప్రోగ్రామ్ పెడతాను, అందరూ రండి' అని అదిరిపోయే కౌంటర్ ఇచ్చారు. మందుబాబుల 'స్మార్ట్ ప్లాన్' పోలీసుల చేతికి చిక్కడంతో ఇప్పుడు గోదావరిఖనిలో ఈ వార్త చర్చనీయాంశంగా మారింది. పోలీసులు సాంకేతికతను వాడుకుని మరీ మందుబాబుల ఆట కట్టించడంతో, ఇప్పుడు ఆ గ్రూప్‌లో ఉన్న సభ్యులంతా పోలీసులకు ఎక్కడ దొరికిపోతామో అని బిక్కుబిక్కుమంటున్నారు.

# రాష్ట్రేతర ఓటర్లకు ప్రభుత్వం శుభవార్త

## ఓటేయడానికి వెళ్లే ఉద్యోగులకు ప్రత్యేక సెలవు

**హైదరాబాద్, ఏప్రిల్ 4:** ఐదు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో జరిగే ప్రజాస్వామ్య పండుగలో ఓటర్లు చురుగ్గా పాల్గొనేలా ప్రోత్సహించేందుకు.. ఆయా రాష్ట్రాలకు చెందిన వారై ఉండి తెలంగాణలో నివసిస్తున్న ఓటర్ల కోసం ప్రత్యేక సెలవులను ప్రకటించింది. ఈ మేరకు కార్మిక , ఉపాధి శాఖ అధికారిక ఉత్తర్వులను జారీ చేసింది. ఎన్నికలు జరుగుతున్న అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు , పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన ఓటర్లు ఎవరైతే తెలంగాణలో ఉద్యోగ రీత్యా లేదా ఇతర పనుల నిమిత్తం స్థిరపడ్డారో.. వారందరికీ తమ సొంత రాష్ట్రాల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఈ వెసులుబాటు కల్పించింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. ఈ సెలవు కేవలం ప్రభుత్వ కార్యాలయాలకే పరిమితం కాకుండా ప్రైవేట్ రంగాలకు కూడా వర్తిస్తుంది.

# బాసర మాస్టర్ ప్లాన్‌కు గ్రీన్ సిగ్నల్

మొదటి పేజీ తరువాయి

సంబంధించి సమగ్ర మాస్టర్ ప్లాన్ ఇప్పటికే సిద్ధం కాగా, ఆలయాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని సీఎం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రహదారులు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఆలయ పరిసరాల్లో పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ఈవీ వాహనాలనే అనుమతించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని స్పష్టం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ఆలయ పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నియంత్రణలు ఉ ండాలని సీఎం పేర్కొన్నారు. భక్తులకు సౌకర్యాలు కల్పిస్తూ, ఆలయాన్ని అభివృద్ధి చేసే దిశగా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశంచేశారు. బాసర ఆలయ అభివృద్ధిపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను సీఎంకు అధికారులు వివరించారు. మాస్టర్ ప్లాన్‌పై అధికారులకు పలు సూచనలు చేశారు సీఎం. ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ, శాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి ఉండాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను, రద్దీని



దృష్టిలో ఉంచుకుని విశాలమైన రోడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయ పరిసరాల్లో ఈవీ వాహనాలను మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా నిబంధనలు కఠినతరం చేయాలని ఆదేశించారు. తిరుమల తరహాలో అన్ని ఆలయాల పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నిబంధనలు ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సమావేశానికి మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ నెల 6న బాసర ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. రూ.225 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు.



# ఇబ్రహీంపట్నం, క్యాతన్‌పల్లి బీఆర్ఎస్ కైవసం

## ఇబ్రహీంపట్నం ఛైర్మన్ గా సుదర్శన్ రెడ్డి ఎన్నిక.. క్యాతన్ పల్లి పీఠం దక్కించుకున్న సంధ్యారాణి

- ఎన్నిక ప్రక్రియకు దూరంగా ఉన్న కాంగ్రెస్ కౌన్సిలర్లు
- బీఆర్ఎస్ కు మద్దతుగా నిలిచిన బీజేపీ, సీపీఐ

**హైదరాబాద్, ఏప్రిల్ 4:** రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. మున్సిపల్ ఛైర్మన్ గా బీఆర్ఎస్ అభ్యర్థి టేకుల సుదర్శన్ రెడ్డి ఎన్నికయ్యారు. వైస్ ఛైర్ పర్సన్ గా బీజేపీ కౌన్సిలర్ ముత్యాల శ్యామలను ఎన్నుకున్నారు. గత కొన్ని రోజులుగా ఉత్కంఠ రేపిన ఈ ఎన్నిక కోర్టు ఆదేశాల మేరకు శనివారం జరిగింది. ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలను చేతులు ఎత్తే విధానంలో నిర్వహించారు. ఈ ఎన్నికలో బీఆర్ఎస్ నుంచి సుదర్శన్ రెడ్డి పోటీ చేయగా, కాంగ్రెస్ నుంచి ఆకుల యాదగిరి పేరును ప్రతిపాదించారు. మెజారిటీ సభ్యుల మద్దతుతో బీఆర్ఎస్ ఈ మున్సిపాలిటీని తన ఖాతాలో వేసుకుంది.

### హస్తం పార్టీ ఆందోళన

ఎన్నిక సందర్భంగా ఇబ్రహీంపట్నంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ముగ్గురు కౌన్సిలర్లపై కోర్టులో కేసు పెండింగ్ లో ఉన్నందున ఎన్నికను వాయిదా వేయాలని కాంగ్రెస్ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ 55 రోజులుగా క్యాంపు నిర్వహించిందని ఆరోపించారు. అయితే ఎన్నికల అధికారులు కాంగ్రెస్ అభ్యంతరాలను తోసిపుచ్చారు. కోర్టు ఆదేశాల మేరకే ఎన్నిక నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేసి ప్రక్రియను పూర్తి చేశారు. దీంతో కాంగ్రెస్ కౌన్సిలర్లు ఈ ఎన్నికకు దూరంగా ఉన్నారు.

### క్యాతన్ పల్లి పీఠంపై గులాబీ జెండా

మంచిర్యాల జిల్లా క్యాతన్ పల్లి మున్సిపాలిటీని సైతం బీఆర్ఎస్ దక్కించుకుంది. ఇక్కడ ఛైర్ పర్సన్ గా బీఆర్ఎస్ కౌన్సిలర్ గొడిశెల సంధ్యారాణి ఎన్నికయ్యారు. సీపీఐ మద్దతుతో ఆమె ఈ విజయం సాధించారు. వైస్ ఛైర్మన్ పదవిని సీపీఐ కౌన్సిలర్ మిట్టపల్లి సరిత దక్కించుకున్నారు. క్యాతన్ పల్లిలో బీఆర్ఎస్, సీపీఐ పొత్తు పెట్టుకున్నాయి. మొత్తం 22 వార్డులకు గాను బీఆర్ఎస్ 10, సీపీఐ 4 వార్డుల్లో గెలుపొందగా, కాంగ్రెస్ 7 స్థానాలకే పరిమితమైంది.

### ముగిసిన ఉత్కంఠ


గతంలో కాంగ్రెస్ నేతల ఆందోళనల వల్ల క్యాతన్ పల్లి మున్సిపల్ ఎన్నిక ప్రక్రియ నిలిచిపోయింది. చివరకు కోర్టు ఆదేశాలతో శనివారం ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికకు కాంగ్రెస్ కౌన్సిలర్లు హాజరు కాలేదు. బీఆర్ఎస్, సీపీఐకి చెందిన 14 మంది కౌన్సిలర్లు హాజరు కావడంతో కోరం ఉన్నట్లు అధికారులు గుర్తించి ఎన్నిక పూర్తి చేశారు. దీంతో సంధ్యారాణి ఛైర్ పర్సన్ గా, సరిత వైస్ ఛైర్మన్ గా బాధ్యతలు చేపట్టనున్నారు. రెండు మున్సిపాలిటీలను బీఆర్ఎస్ గెలుచుకోవడంతో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి.

# కేసీఆర్ క్యాంప్ కార్యాలయంపై దాడి

## క్షీణిస్తున్న శాంతిభద్రతలకు నిదర్శనం

## మండిపడ్డ బీఆర్ఎస్ నేతలు

**హైదరాబాద్, ఏప్రిల్ 4:** ప్రతిపక్ష నేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, కేసీఆర్ క్యాంపు కార్యాలయంపై జరిగిన దాడిని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన రాష్ట్రంలో క్షీణిస్తున్న శాంతిభద్రతలకు నిదర్శనమని వారు అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మహనీయుడు కేసీఆర్ కార్యాలయంపై దాడి చేయడం అంటే తెలంగాణ ప్రజల గౌరవంపై దాడి చేసినట్టేనని మండిపడ్డారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను ప్రజలు ఎప్పటికీ సహించరని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నేత కార్యాలయంపై దాడి జరగడం అత్యంత ఆందోళనకరమని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. అధికార అహంకారంతో కాంగ్రెస్ నాయకులు హద్దులు దాటుతున్నారని మండిపడ్డారు. ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులను భయపెట్టేందుకు ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజా ప్రతినిధులకే రక్షణ లేకపోతే సాధారణ ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. పోలీసు యంత్రాంగం తక్షణమే స్పందించి దాడికి పాల్పడిన వారిని గుర్తించి, అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారికి ప్రభుత్వం అండగా నిలిస్తే ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీపై ఎలాంటి అణచివేతలు చేసినా వెనక్కి తగ్గబోమని, ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాలపై దాడులు ఆపాలని, తెలంగాణ గౌరవాన్ని కాపాడాలని సూచించారు.



# ఖానాపూర్ మున్సిపల్ ఎన్నిక వాయిదా

## రణరంగంగా మారిన కార్యాలయం

- చేతులు ఎత్తే క్రమంలో కౌన్సిలర్ల మధ్య తీవ్ర వాగ్వాదం
- అధికారులతో ఎమ్మెల్యే బొజ్జు, కాంగ్రెస్ నేతల ఘర్షణ
- మాజీ మంత్రి జోగు రామన్న హౌస్ అరెస్ట్
- మున్సిపల్ ఆఫీస్ ముందు బీఆర్ఎస్, బీజేపీ సభ్యుల ఆందోళన

**నిర్మల్, ఏప్రిల్ 04 (మనసులో మాట):** ఖానాపూర్ మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక సందర్భంగా కౌన్సిలర్ల మధ్య చోటుచేసుకున్న తీవ్ర వాగ్వాదంతో ఎన్నిక ప్రక్రియ వాయిదా పడింది. ఓటింగ్ కోసం చేతులు ఎత్తే క్రమంలో కౌన్సిలర్లు రెండు వర్గాలుగా విడిపోయి గొడవకు దిగారు. అధికారులతో ఎమ్మెల్యే బొజ్జు, కాంగ్రెస్ కౌన్సిలర్లు వాగ్వాదానికి దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో అధికారులు ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తారనే దానిపై స్పష్టత లేకపోవడంతో సందిగ్ధత నెలకొంది.

### ఎమ్మెల్యే వాకౌట్.. విపక్షాల నిరసన

మున్సిపల్ సమావేశం నుంచి ఎమ్మెల్యే బొజ్జు బయటకు వెళ్లిపోగా.. కార్యాలయం బయట బీజేపీ, బీఆర్ఎస్ సభ్యులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే అధికారులను బెదిరిస్తున్నారని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నిక జరగనివ్వడం లేదని నినాదాలు చేశారు. ఈ క్రమంలోనే ఖానాపూర్ బీఆర్ఎస్ ఇన్ ఛార్జి, మాజీ మంత్రి జోగు రామన్నను పోలీసులు ఆదిలాబాద్ లో ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేశారు. ఎన్నిక ప్రభావితం కాకుండా ఉండేందుకు పోలీసులు ఈ చర్య తీసుకున్నట్లు తెలుస్తోంది. తన అరెస్ట్ పై జోగు రామన్న తీవ్రంగా స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డి హోంశాఖను అడ్డం పెట్టుకుని ప్రశ్నించే గొంతులను అణచివేస్తున్నారని విమర్శించారు. ఖానాపూర్ మున్సిపల్ ఎన్నిక బీఆర్ఎస్ కు అనుకూలంగా ఉండటంతో కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలకు తెరలేపిందని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. రాజ్యాంగ నియమాలను



ఉల్లంఘిస్తూ పోలీసుల పహారా మధ్య ఎన్నికలు జరపాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు త్వరలోనే కాంగ్రెస్ కు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.



సంపాదకీయం

# గ్రామాల అభివృద్ధికి దృష్టి సారించాలి!

రైజింగ్ తెలంగాణ, ట్రీ మిలియన్ ఎకానమీ...ఇవన్నీ వినడానికి బాగానే ఉన్నా..ఆచరణలో పట్టుదల ముఖ్యం. ఎపిలో స్వర్ణగ్రామం, స్వర్ వార్డులు అంటూ కొత్త పేర్లతో ఊదరగొడుతున్నారు. గ్రామాలు లేకుండా అభివృద్ధి సాధ్యం కాదు. ఎంతసేపు పల్లెలను విస్మరించి, పట్టణాలకే పెద్దపీట వేయడం సరికాదు. గ్రామాల అవసరాలను గుర్తించడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. నిరంతరంగా ప్రభుత్వంపై ఆధారపడే దుస్థితి నుంచి తప్పించాలి. ఫ్యూచర్ సిటీ, దేశ పురోభివృద్ధి, ఆర్థికంగా బలోపేతంలో పదిశాతం భాగస్వామ్యం అవుతామంటున్న సిఎం రేవంత్ రెడ్డి, గ్రామాలను విస్మరిస్తే అనుకున్న ఫలితాలను సాధించలేరు. గ్రామాలను బలోపేతం చేస్తే పట్టణాలపై ఒత్తిడి తగ్గగలదు. గ్రామాల్లో విద్య,వైద్యం, పారిశుధ్యం, పచ్చదనం వంటివన్నీ ప్రధాన సమస్యలుగా ఉన్నాయి.  గత రెండేళ్లుగా గ్రామాలు కునారిల్లాయి. కనీస వసతులు లేవు. గ్రామాల్లో అత్యధిక శాతం అధికార కాంగ్రెస్ ఆధిపత్యంలోనే ఉన్నాయి. రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి విషయంలో అంతా కలసి రావాలి. గ్రామాలను బలోపేతం చేస్తేనే, గ్రామాల ఆర్థిక వ్యవస్థలు బలపడితేనే రాష్ట్రం, తద్వారా దేశం అభివృద్ధి చెందగలదు. అందువల్ల ఇప్పటి నుంచే గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రచించాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా ఆలోచన చేయాలి.  గ్రామాల్లో ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ పరిష్కరించలేనివేమీ కాదు. అందువల్ల వెంటనే ఇందుకు కార్యాచరణ చేయాలి. సాగునీరు, తాగునీరు, విద్యుత్ సరఫరా, పారిశుద్యం వట్టి సమస్యలపై ఇరు రాష్ట్రాల సిఎంలు శ్రమించాలి. ఉచిత పథకాలు పెరిగినా కొద్దీ గ్రామాల్లో కూలీల కొరత ఏర్పడుతోంది. పనిచేసే కూలీలు దొరక్క రైతులు నానా అగచాట్లు పడుతున్నారు.   అన్నీ ప్రభుత్వం చేస్తుందనే ధోరణి నుంచి ప్రజలు బయపటడేలా చేయాలి. నా గ్రామాన్ని నేనే కాపాడుకోవాలన్న నినాదంతో ముందుకు సాగాలి. సర్పంచ్‌లను అందుకు భాగస్వాములను చేయాలి. అనవసర పథకాలకు వేలకోట్లు తగలేసే బదులు గ్రామాలను అభివృద్ది చేసే కార్యాచరణకు నిధులు వెచ్చించాలి. ప్రభుత్వంపై ఆశతో ప్రజలు ఉన్నారని గుర్తించాలి. ఏదో చేస్తారన్న నమ్మకం ఉంది. ఇందిరమ్మ ఇళ్లు కావచ్చు, ఇతర అభివృద్ధికావచ్చు గ్రమాలను దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగాలి. ప్రపంచ చిత్రపటంలో తెలంగాణను ముందువరసలో నిలబెడతామంటున్న ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు గ్రామాలను విస్మరిస్తే ముందుకు సాగలేరు. ప్రధానంగా తాగునీటి సమస్య, వైద్యరంగాలను, విద్యారంగాన్ని బలోపేతం చేయాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసేలా కార్యచరణ ఉంటే నిరుద్యోగిత కూడా తగ్గుతుంది. వ్యయసాయాధిరత చిన్న పరిశ్రమలకు ఊతం ఇచ్చే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రపంచంలో తెలంగాణకు ముఖ్యంగా రాజధాని హైదరాబాద్‌కు అత్యధిక ప్రాధాన్యతను కలిగి ఉన్నది. చారిత్రకంగా, భౌగోళికంగా,ఆర్థికంగా దేశ అభివృద్ధిలో తెలంగాణ అత్యంత కీలక పాత్రను పోషిస్తున్నది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ అబివృద్ధి ఆధునిక, హైటెక్ రాజధానిగా అభివృద్ధి చెందింది. దేశంలో ప్రధాన మెట్రో సిటీలుగా ప్రసిద్ధి చెందిన ఢిల్లీ, చెన్నై, ముంబయ్, కలకత్తాల కంటే అనువైన వాతావరణ పరిస్థితులు హైదరాబాద్‌లో ఉన్నాయి. హైదరాబాద్ చుట్టూ తెలంగాన అభివృద్ధి చెందడానికి అనువైన వాతావరణం ఉంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేస్తే రాజధానులపై  ఒత్తిడి తగ్గుతంది. ప్రధానంగా వ్యవసాయాధారిత పరిశ్రమలతో యువతను గ్రామాలకు మళ్లించాలి. దాంతో ఆర్థికంగా ఎదుగుదలతో పాటు గ్రామాలు పురోగమిస్తాయి.  తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఉజ్వల తెలంగాణ నిర్మాణానికి పూనుకుంటే అది దేశానికి ఆదర్శంగా నిలుస్తుంది. 2047 నాటి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిర్మించటం విజన్ డాక్యుమెంట్ లక్ష్యం కనుక, మనం వ్యవసాయరంగంలో అగ్రభాగాన ఉన్నాం కనుక వ్యవసాయోత్పత్తులు, అనుబంధ రంగాలను బలోపేతం చేసుకుంటూ పోతే, ఆర్థికంగా ఎదగడానికి దోహదపడగలదు.  దీనికోసం ప్రధానంగా సేవలు, పారిశ్రామిక రంగంపై దృష్టి కేంద్రీకరించాలి. మద్దతుగా వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించాలి. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని అభివృద్ధికి దోహదపడేలా చేయాలి. అప్పుడే తెలంగాన కల సాకారం కాగలదు. గతంలో లాగా చెట్టుపేరు చెప్పి కాయలు అమ్ముకునే దుస్థితి రాకుండా చూసుకోవాలి. వ్యవసాయ పంటల కొనుగోళ్లను సజావుగా సాగేలా చూడాలి. పంటల విధానంలో మార్పులు రావాలి. ఇవన్నీ జరిగితేనే అనుకున్న అభివృద్ధి స్పాధ్యం కాగలదు.



# భారీ ఉగ్రకుట్ర భగ్నం

నలుగురు ఉగ్రవాదుల అరెస్టు..

**ఢిల్లీ:** దేశంలో భారీ పేలుళ్ల ఉగ్రకుట్రను ఉత్తర్ ప్రదేశ్ పోలీసులు భగ్నం చేశారు. పేలుళ్లకు ప్రణాళికలు రచించిన నలుగురిని ఉత్తర ప్రదేశ్ ఉగ్రవాద నిరోధక దళం(ఏటీఎస్) అరెస్టు చేసింది. నిందితులకు పాక్ ఉగ్ర సంస్థలతో సంబంధాలు ఉన్నట్లు విచారణలో తేలింది. నలుగురు నిందితులను సాకిబ్ అలియాస్ డెవిల్, వికాస్ గెహ్లోవత్ అలియాస్ రౌనక్, లోకేశ్ అలియాస్ పాప్లా పండిట్ అలియాస్ బాబు అలియాస్ సంజు, అర్బాబ్‌గా గుర్తించారు. పాకిస్థాన్ హ్యాండ్లర్ల ఆదేశాల మేరకు వీరంతా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వీరంతా దేశవ్యాప్తంగా పేలుళ్లకు ప్లాన్ చేసినట్లు పోలీసులు తెలిపారు. నలుగురు నిందితులు టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా పాకిస్థాన్ తీవ్రవాద గ్రూపులతో సంబంధాలు కలిగి ఉన్నట్లు విచారణలో ఏటీఎస్ పోలీసులు గుర్తించారు. ప్రధాన నిందితుడు మీరట్‌కు చెందిన సాకిబ్ అలియాస్ డెవిల్ అని తెలిపారు. మిగిలిన ముగ్గురితో కలిసి దేశంలో అతను పేలుళ్లకు ప్లాన్ చేసినట్లు వెల్లడించారు. ఏప్రిల్ 2న లక్నో రైల్వేస్టేషన్ వద్ద పేలుడుకు కుట్ర పన్నుతుండగా పక్కా సమాచారంతో ఘటనా స్థలానికి వెళ్లి వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరిపై బీఎన్ఎస్, ఉపా చట్టాల కింద కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుల నుంచి పేలుడు పదార్థాలు, ఏడు స్మార్ట్ ఫోన్లు, 24 కరపత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ నిందితులు కొన్ని ప్రదేశాల్లో చిన్నపాటి పేలుళ్లకు పాల్పడ్డారని.. దాన్ని వీడియో తీసి ఉగ్రసంస్థలకు పంపారని పోలీసులు తెలిపారు. దాని ద్వారా ఉగ్రసంస్థల నుంచి నిధులు సేకరించారన్నారు. వీరంతా సోషల్ మీడియాను ఉపయోగించి యువతను తీవ్రవాదం వైపు ఆకర్షించే ప్రయత్నం చేశారన్నారు. రైల్వే సిగ్నల్స్, గ్యాస్ సిలిండర్ల ట్రక్కులు, ప్రభుత్వ కీలక ఆస్తులే లక్ష్యంగా దాడికి ప్లాన్ చేసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే వీరంతా రాజకీయ ప్రముఖుల ఇళ్లు, ప్రముఖ సంస్థల వద్ద రెక్కీ నిర్వహించారని.. ఆ సమాచారాన్ని పాకిస్థానీ హ్యాండ్లర్లకు పంపారని తెలిపారు. ఘజియాబాద్, అలీగఢ్, లక్నోతోపాటు ప్రముఖ ప్రదేశాల్లో వీరంతా సర్వే చేశారని పోలీసులు పేర్కొన్నారు.



# కేరళలో ఎల్‌డీఎఫ్‌కు ఉద్వాసన

- బీజేపీ విజయం ఖాయం
- దక్షిణాది రాష్ట్రాల సీట్ల తగ్గింపుపై జరుగుతున్న ప్రచారంలో నిజం లేదు
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

**తిరువనంతపురం:** కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయెన్స్ (ఎన్డీఏ) అధికారంలోకి వస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఎల్డీఎఫ్ ఉద్వాసనకు కౌంట్‌డౌన్ మొదలైందని చెప్పారు. తిరువల్ల మున్సిపాలిటీలో శనివారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో మోదీ మాట్లాడుతూ, కేరళ అభివృద్ధిపై కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమి ఎన్నడూ దృష్టి పెట్టలేదని, 2004-2014 మధ్య కేరళ అభివృద్ధికి అప్పటి కేంద్రలోని యూపీఏ ప్రభుత్వం కేటాయించిన మొత్తం కంటే తమ ప్రభుత్వం ఎక్కువ కేటాయించిందని చెప్పారు. జనాభా నియంత్రణతో దక్షిణాది రాష్ట్రాలు లోక్‌సభ స్థానాలు కోల్పోతాయంటూ చేస్తున్న వాదనల్లో కూడా నిజం లేదని స్పష్టం చేశారు. 'ఇంతకుముందు కూడా ఇక్కడకు వచ్చాను. కానీ ఈసారి అన్నివైపుల నుంచి మార్పు కోరుతున్న బలమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. కేరళలో అతిపెద్ద మార్పు రాబోతోంది. తొలిసారి బీజేపీ-ఎన్డీయే ప్రభుత్వం కేరళలో అధికారంలోకి రాబోతోంది' అని మోదీ ధీమా వ్యక్తం చేశారు. ఎల్డీఎఫ్-యూడీఎఫ్ ప్రభుత్వాలు ఎప్పుడూ ఈ ప్రాంతం గురించి పట్టించుకోలేదని, రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని, చాలా ఏళ్లుగా ఒక్క ప్రధాన బ్రిడ్జి కూడా నిర్మించ లేదని, మెడికల్ కాలేజీ పరిస్థితి దయనీయంగా ఉందని విమర్శించారు. కనీస మౌలిక సదుపాయాలు లేకుండా జీవన ప్రమాణాలు ఏ స్థాయిలో ఉంటాయనేది ఎవరైనా ఊహించవచ్చని అన్నారు.



### మోదీ గ్యారెంటీ..

ఎన్డీయే విధానాలతో ప్రతి ఒక్క వర్గానికి, ముఖ్యంగా మహిళలు ఎంతో లబ్ధి పొందుతున్నారని ప్రధాని అన్నారు. వలస కార్మికులకు ఉద్యోగాలు కల్పన కేరళలో అతిపెద్ద సమస్యగా ఉందని, బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని సమస్యలను పరిష్కరిస్తామని, ఇది మోదీ ఇచ్చే హామీ అని ప్రధాని భరోసా ఇచ్చారు. ఈశాన్య రాష్ట్రాలు, గోవా తరహాలోనే కేరళను అభివృద్ధి చేస్తామని అన్నారు. సబరి రైల్వే ప్రాజెక్టు నిలిచిపోవడానికి ఎల్‌డీఎఫ్ కారణమని విమర్శించారు. బీజేపీ డబుల్ ఇంజన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్ని అడ్డంకులూ తొలగిపోతాయని భరోసా ఇచ్చారు. కాగా, కేరళ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 9న ఒకే విడతలో జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

## బావిలోకి దూసుకెళ్లిన కారు

## ఒకే కుటుంబానికి చెందిన 9మంది మృతి



**ముంబై, ఏప్రిల్ 4:** మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బావిలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారులో ఉన్న 9 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారని మృతుల బంధువులు తెలిపారు. నాసిక్ జిల్లా డిండోరీ తాలూకాలో ఈ ప్రమాదం జరిగింది. శివాజీ నగర్‌లో ఓ శుభకార్యానికి హాజరై తిరిగి తమ స్వగ్రామానికి వెళ్తుండగా వారిని మృత్యువు కబలించింది. వివరాల్లోకి వెళ్తే.. నాసిక్ జిల్లాలోని డిండోరీ ప్రాంతానికి చెందిన సునీల్ దత్తాత్రేయ దర్గుడే (34).. తన భార్య రేష్మా దర్గుడే (30), కుమార్తె రాఖీ అలియాస్ గుణవతి దర్గుడే, వదిన ఆశా దర్గుడే (32), ఆమె కుమారుడు శ్రేయాస్ దర్గుడే, కుమార్తె శ్రిష్టి దర్గుడేతో కలిసి కారులో శివాజీనగర్‌లో శుక్రవారం రాత్రి జరిగిన ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. వేసవి సెలవులు కావడంతో.. ఫంక్షన్ అనంతరం రేష్మా దర్గుడే మేనకోడళ్లు మాధురి, శ్రావణి.. అశా దర్గుడే మేన కోడలు సమృద్ధి కూడా వారితో ఇండోర్ గ్రామానికి బయలుదేరారు. తిరుగు ప్రయాణంలో డిండోరీ తాలూకా కేంద్రంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఓ బావిలోకి దూసుకెళ్లింది. అది గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు.

# ట్రంప్ నియంత్రణలో మోదీ

- ఆయన నియంత్రణలో పినరయి
- రాహుల్ గాంధీ విసుర్లు



**ఇడుక్కి:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి విమర్శలు గుప్పించారు. నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నియంత్రణలో ఉన్నారని, అత్యంత అవమైనకరమైన విషయం ఏమిటంటే ట్రంప్‌ను 'సర్' అని ఆయన పిలుస్తారని చెప్పారు. మోదీ ఇంకా బ్రిటిష్ కాలంలో ఉన్నానని అనుకుంటున్నారని విమర్శించారు. మోదీని ట్రంప్ నియంత్రిస్తున్నట్టే పినరయి విజయన్‌ను మోదీ నియంత్రిస్తున్నారని అన్నారు. కేరళంలోని ఇడుక్కిలో శనివారం జరిగిన ఎన్నికల ప్రచారసభలో రాహుల్ మాట్లాడుతూ, బీజేపీతో లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ కుమ్మక్కయిందని ఆరోపించారు. 'బీజేపీ, ఆర్ఎస్ఎస్, లెఫ్ట్ ఫ్రంట్ మధ్య సంబంధాలను ఇవాళ ప్రతి ఒక్కరూ చూడొచ్చు. లెఫ్ట్ ఫ్రంట్‌లో సిద్ధాంతాల కోసం ఎళ్లతరబడి పనిచేసిన అవకాశవాదులు కాని కొందరు ఇప్పుడు తమను పార్టీ వంచించిందని ఆవేదన చెందుతున్నారు' అని రాహుల్ తెలిపారు. బీజేపీ-ఆర్ఎస్ఎస్‌తో కుమ్మక్కయినందునే ఎల్‌డీఎఫ్ తన వామపక్ష భావజాలాన్ని కోల్పోయిందన్నారు. కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ ఎప్పుడూ సైద్ధాంతిక ప్రత్యర్థిగా ఎల్‌డీఎఫ్‌తో పోరాడేదని, ఇప్పుడు ఎల్డీఎఫ్ మారిపోయిందని, ఎల్‌డీఎఫ్‌లో 'లెఫ్ట్' అనేదే లేదని, ఎన్నికల తర్వాత అందులో ఏదీ మిగలదని అన్నారు. కేరళలోని ప్రభుత్వాన్ని ఒక చీకటి శక్తి ప్రభావితం చేస్తోందని, అది రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ ప్రజలపై దాడి చేస్తోందని పరోక్షంగా బీజేపీ-ఆర్ఎస్ఎస్‌పై రాహుల్ విమర్శలు గుప్పించారు. ప్రధానమంత్రి మోదీ ఏ రాష్ట్రానికి వెళ్లిగా మతం, ఆలయాలు గురించి మాట్లాడతారని, కేరళ అంశాల విషయానికి వచ్చేసరికి మాత్రం పెదవి విప్పరని శబరిమల బంగారం కేసును ప్రస్తావిస్తూ అన్నారు. ఎల్‌డీఎఫ్‌కు హెల్ప్ చేయాలని ఆయన అనుకోవడమే అందుకు కారణమని వివరించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో పోరాడుతున్నందున తనపై చాలా కేసులు పెట్టారని, ఇంటరాగేట్ చేశారని, అయినా కూడా తాను వెనుదీయలేదని చెప్పారు. మోదీ ప్రతిరోజూ తనపై విమర్శల దాడి చేస్తారని, కానీ కేరళ సీఎం గురించి కానీ, ఆయన కుటుంబం గురించి కానీ ఒక్క మాట మాట్లాడరని అన్నారు. జాతీయ అంశాలపై మోదీని ఎల్డీఎఫ్ ఎప్పుడూ సవాలు చేయకపోవడమే ఇందుకు కారణమని అన్నారు. ఏప్రిల్ 9న కేరళ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# హర్మ్యూజ్ దాటిన 'గ్రీన్ శాన్వీ'.. : స్పందించిన ఇరాన్

**ఢిల్లీ:** గల్ఫ్ నుంచి ఎల్పీజీ లోడ్‌తో భారత్‌కు బయల్దేరిన మరో నౌక 'గ్రీన్ శాన్వీ'.. హర్మ్యూజ్ జలసంధిని సురక్షితంగా దాటింది. మరికొన్ని రోజుల్లో ఇక్కడికి చేరుకోనుంది. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ గుజరాత్ మంత్రి హర్ష్ సంఘ్వీ 'ఎక్స్' వేదికగా ఓ పోస్టు పెట్టారు. దీనిపై ముంబయిలోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ స్పందించింది. భారత్‌తో స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే విషయానికి కట్టుబడి ఉన్నట్లు పేర్కొంది. "ఎల్పీజీ నౌక 'గ్రీన్ శాన్వీ' విజయవంతంగా హర్మ్యూజ్ జలసంధిని దాటింది. భారత దౌత్యానికి ఇది మరో విజయం" అని గుజరాత్ మంత్రి హర్ష్ సంఘ్వీ పోస్టు చేశారు. దీనిపై ముంబయిలోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ స్పందిస్తూ.. "శతాబ్దాల క్రితం మా ప్రాంతం నుంచి వచ్చిన వారికి భారత్, ముఖ్యంగా గుజరాత్.. సాదరంగా స్వాగతం పలికాయి. మా చరిత్రలో ఇవి విశిష్ట స్థానాన్ని కలిగి ఉన్నాయి. ఈ సుదీర్ఘ నాగరిక అనుబంధాన్ని పునాదిగా చేసుకుని.. స్నేహం, సహకార సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే విషయానికి కట్టుబడి ఉన్నాం" అని తెలిపింది. 'గ్రీన్ శాన్వీ' సహా ఇప్పటివరకు భారత్ జెండాతో కూడిన ఎనిమిది ఇంధన నౌకలు హర్మ్యూజ్ జలసంధిని దాటాయి. ఇంకా 15కుపైగా నౌకలు ఆ ప్రాంతంలో చిక్కుకుపోయాయి. ప్రస్తుతానికి భారత జెండా కలిగిన నౌకలను స్వదేశానికి తీసుకురావడానికే ప్రాధాన్యం



ఇస్తున్నట్లు ఓడరేవులు, నౌకా రవాణా, జలమార్గాల శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ కుమార్ సిన్హా ఇటీవల మీడియాతో మాట్లాడుతూ చెప్పారు.



# కేసీఆర్ క్యాంపు కార్యాలయం ముట్టడి

## కాంగ్రెస్ శ్రేణుల నిరసనతో ఉద్రిక్తత



క్యాంపు,కార్యాలయంలోకి దూసుకెళ్లి సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కార్యకర్తలు

- పోలీసులతో తోపులాట.. ముట్టడిలో క్యాంపు ఆఫీస్ అద్దాలు ధ్వంసం.. గజ్వేల్‌లో పెరిగిన రాజకీయ వేడి
- ఫామ్‌హౌస్‌కే పరిమితమై ప్రజలను గాలికి వదిలేశారని డీసీసీ అధ్యక్షురాలు అంక్షారెడ్డి ధ్వజమెత్తారు





**నేటి సాక్షి, గజ్వేల్:** గజ్వేల్ నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. స్థానిక ఎమ్మెల్యే, మాజీ సీఎం కేసీఆర్ ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని ఆరోపిస్తూ డీసీసీ అధ్యక్షురాలు అంక్షారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు శనివారం కేసీఆర్ క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అంబేద్కర్ చౌరస్తా నుంచి భారీ ర్యాలీగా చేరుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు, పోలీసుల కళ్లుగప్పి ఒక్కసారిగా క్యాంపు కార్యాలయంలోకి దూసుకెళ్లారు. అక్కడ ప్రోటోకాల్ ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని బిగించి, జై కాంగ్రెస్ నినాదాలతో హోరెత్తించారు. నిరసనకారులను అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించగా ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో కార్యాలయ ప్రధాన ద్వారం అద్దాలు పగిలిపోయాయి. అనంతరం అంక్షారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమై నియోజకవర్గ సమస్యలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడం వల్ల సంక్షేమ పథకాల చెక్కుల పంపిణీ నిలిచిపోయిందని ఆరోపించారు. కేసీఆర్ తన వైఖరి మార్చుకోకపోతే రానున్న రోజుల్లో ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేటి సాక్షి
కరీంనగర్
ఆదివారం
5 ఏప్రిల్ 2026

## చర్లపల్లిలో ఎడ్ల బండ్ల పోటీలు



**నేటి సాక్షి, ఎండపల్లి:** మండలంలోని చర్లపల్లి గ్రామంలో ఎడ్ల బండ్ల పోటీలను సోమవారం ఉదయం 10:30 గంటలకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామంలో పోటీల నిర్వహణ కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, సమిష్టిగా ప్రజలను ఉత్సాహపరిచేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. పోటీలలో గెలుపొందిన వారికి ఆకర్షణీయమైన నగదు బహుమతులు ఏర్పాటు చేశారు. మొదటి బహుమతిగా ఆర్.ఎస్సై మాదాసు శ్రీనివాస్ రూ.20,000 ప్రకటించగా, రెండవ బహుమతిగా పోటీల నిర్వహణ కమిటీ సభ్యులు రూ.15,000, మూడవ బహుమతిని గ్రామ యువత అందజేయనున్నారు. దాతల సహకారంతో ఎడ్ల బండ్ల దారి (బాత)ను మరమ్మత్తు చేసి పోటీలకు అనుకూలంగా సిద్ధం చేశారు. పోటీలలో నిలిచేందుకు నిర్ణీత ఎంట్రీ ఫీజు చెల్లించి పెద్ద సంఖ్యలో ఎడ్ల బండ్లతో పాల్గొనాలని కమిటీ కోరింది. వీటిని తిలకించేందుకు వచ్చే ప్రేక్షకుల కోసం మాదాసు బాపన్న అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ పోటీలతో గ్రామంలో సందడి నెలకొననున్న నేపథ్యంలో ప్రజలు సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

## మిషన్ భగీరథ తోనే ఆరోగ్యం



**నేటి సాక్షి చిలుకూరు:** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం శీతాలతండ లో నిర్వహించిన గ్రామ సభలో కలుసిత నీటి వ్యాధులనుండి దూరం చేసి ప్రజల జీవన ప్రమాణాలను పెంచడమే మిషన్ భగీరథ ప్రధాని ఉద్దేశమని ఎంపీడీవో ముక్కపాటి నరసింహారావు పేర్కొన్నారు. జల జీవనం మిషన్లో భాగంగా నిర్వహించిన గ్రామసభలో సర్పంచ్ బానోత్ కృష్ణ మాట్లాడుతూ నది జలాలను శుద్ధి చేసి మిషన్ భగీరథ ద్వారా అందిస్తున్నామని ఈ నీరు చాలా ఆరోగ్యవంతమని అన్నారు. ఈ యొక్క అవకాశాన్ని ప్రజలు అందరు వినియోగించుకోవాలని సూచించారు.. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భానోత్ కృష్ణ ఉప సర్పంచ్ శకుంతల ఆర్డబ్ల్యూసి ఏఈ నాగులు ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత



**నేటిసాక్షి,తిరుమలాయపాలె, (రుద్రరాజు):** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలో ఎస్సై కూచిపూడి జగదీష్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలు భాగంగా మండల కేంద్రంలో కొక్కిరేణి క్రాస్ రోడ్ వద్ద ఉదయం 6 గంటలకు వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న అశోక్ లేలాండ్ దోస్త్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయక 100 బస్తాల బియ్యం సుమారు 50 క్వింటాలు ఉండడంతో అట్టి వాహనాన్ని రేషన్ బియ్యం తరలిస్తున్న ముగ్గురుని అదుపులోకి తీసుకొని విచారించగా నేరెళ్ల శ్రీకాంత్, ధారావత రమేష్, పగిళ్ల గణేష్, అని తెలిపారు. వీళ్లు మేడిదపల్లి గ్రామానికి చెందిన రామాచారి ద్వారా రేషన్ బియ్యం సేకరించి ఖమ్మంలో ఉన్న షేక్ నన్నేమియా ద్వారా పెద్ద వ్యాపారస్తులకు బియ్యాన్ని ఎక్కువ ధరలకు విక్రయించేందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. ఈ ఐదుగురుపై కేసు నమోదు చేయగా నలుగురిని అరెస్టు చేయడం జరిగింది. రామాచారి పరారీలో ఉన్నట్లు ఎస్సై కూచిపూడి జగదీష్ వెల్లడించారు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన వేల్పుల



**నేటి సాక్షి, నందికొట్కూరు:** నందికొట్కూరు పట్టణంలోని సత్యనారాయణ కళ్యాణ మండపంలో శనివారం జరిగిన వివాహ రిసెప్షన్ వేడుకకు ఐఆర్ఎస్ అధికారి వేల్పుల ఆనంద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తన డ్రైవర్ వెంకటేష్ సోదరి వివాహ వేడుకను పురస్కరించుకుని ఆయన నూతన వధూవరులను కలిసి, వారికి పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన జంట నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆయన ఆశీర్వదించారు. తమ కుటుంబ వేడుకకు ఆనంద్ కుమార్ గారు స్వయంగా విచ్చేసి ఆశీర్వదించడం పట్ల వధువు తల్లిదండ్రులు మరియు కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానికులు మరియు కుటుంబ మిత్రులు పాల్గొన్నారు.

# క్యాంప్ కార్యాలయంలో దాడి జరగలేదు

**మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి**

**నేటి సాక్షి గజ్వేల్:** గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఘటనపై తప్పుడు ప్రచారం జరుగుతోందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఆస్తిగా ఉన్న క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటం లేకపోవడం గమనించిన తమ పార్టీ కార్యకర్తలు అక్కడికి వెళ్లి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి వచ్చారని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. క్యాంప్ కార్యాలయం ప్రభుత్వానికి చెందినదని, అక్కడ ముఖ్యమంత్రి చిత్రపటం ఉండటం సహజమని పేర్కొన్నారు. చిత్రపటం లేకపోవడంతో కార్యకర్తలు గౌరవప్రదంగా సీఎం చిత్రపటాన్ని ఏర్పాటు చేసి వచ్చారని తెలిపారు. అంతేగానీ అక్కడ ఎలాంటి దాడులు, విధ్వంసం జరగలేదని స్పష్టం చేశారు. కొందరు కావాలనే ఈ ఘటనను వక్రీకరించి దాడిగా ప్రచారం చేస్తున్నారని నర్సారెడ్డి ఆరోపించారు. తమ కార్యకర్తలు ఎలాంటి అశాంతి సృష్టించలేదని, ఎవరి ఆస్తినీ ధ్వంసం చేయలేదని అన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా భారాస నాయకులు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. చిన్న విషయాన్ని పెద్దదిగా చేసి రాజకీయ లబ్ధి పొందాలనే ఉద్దేశంతో రాద్ధాంతం సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయంలో ముఖ్యమంత్రి చిత్రపటం ఏర్పాటు చేయడమే తమ ఉద్దేశమని ఆయన తెలిపారు. ప్రజలు వాస్తవాలను అర్థం చేసుకుని తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని నర్సారెడ్డి కోరారు.



# అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్




**నేటిసాక్షి, నల్లగొండ :** అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్ అని నాగార్జున ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డా. సముద్రాల ఉపేందర్ అన్నారు. స్థానిక నాగార్జున ప్రభుత్వ కళాశాలలో భారత మాజీ ఉపప్రధాని, అణగారిన వర్గాల ఆశాజ్యోతి, బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఎన్ ఎస్ ఎస్ మరియు సోషల్ సైన్సెస్ విభాగాల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మరియు అధ్యాపకులు బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, భారత రాజకీయాల్లో బాబు జగ్జీవన్ రామ్ ఒక ధ్రువతార అని, ఆయన జీవితం భావి తరాలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కేంద్ర మంత్రిగా, ఉపప్రధానిగా దేశాభివృద్ధిలో ఆయన పోషించిన పాత్ర వెలకట్టలేనిదని, ముఖ్యంగా హరిత విప్లవం ద్వారా దేశ ఆహార భద్రతలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని గుర్తుచేశారు. సామాజిక సమానత్వం కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన పోరాటాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల పరీక్షల నియంత్రణ అధికారి డా. డి. మునిస్వామి, రాజనీతి శాస్త్ర విభాగం అధ్యక్షులు డా. ఆదే మల్లేశం, ప్రభుత్వ పాలనాశాస్త్ర విభాగం అధ్యక్షులు ఎన్. కోటయ్య, అధ్యాపకులు డా. అనిల్ బొజ్జ, దినేష్, సావిత్రి, టి. శ్రీనివాస్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభువు చూపిన ప్రేమ మార్గంలో నడవాలి






**నేటి సాక్షి, నందికొట్కూరు:** నందికొట్కూరు పట్టణంలోని సిఎస్ఐ సంఘం ఆధ్వర్యంలో శనివారం 'రన్ ఫర్ జీసస్' ర్యాలీని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వేల్పుల ఆనంద్ కుమార్ (ఐఆర్ఎస్), పట్టణ ప్రధాన రహదారి నుండి మిద్దూరు రోడ్డు వరకు జరిగిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక రక్షకుడైన

- **వేల్పుల ఆనంద్ కుమార్ ఐఆర్ఎస్**

యేసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలను ప్రతి ఒక్కరూ తమ హృదయాల్లో భద్రపరుచుకోవాలని సూచించారు. క్రీస్తు చూపిన ప్రేమ, దయ, శాంతి మార్గాలే మానవాళికి దిక్సూచి అని కొనియాడారు. యేసుక్రీస్తు త్యాగం వల్లనే మనకు స్వస్థత, ఆశీర్వాదాలు కలుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ సమాధానంతో మెలగాలని ఆయన ఆకాంక్షించారు. చెడు ఆలోచనలకు తావు ఇవ్వకుండా సన్మార్గంలో నడుస్తూ, పిల్లల భవిష్యత్తును ఉన్నత శిఖరాలకు చేర్చేలా దేవుని ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సోదరులు, సంఘ సభ్యులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు.

# చదువుల దీపం కుటుంబాల రూపురేఖలను మారుస్తుంది





- **వేల్పుల ఆనంద్ కుమార్ ఐఆర్ఎస్**

**నేటి సాక్షి, నందికొట్కూరు:** ఒక దీపం కేవలం ఒక గదికి మాత్రమే వెలుగునిస్తుందని, కానీ చదువు అనే దీపం మొత్తం కుటుంబాల రూపురేఖలనే మారుస్తుందని ఐఆర్ఎస్ అధికారి వేల్పుల ఆనంద్ కుమార్ పేర్కొన్నారు. నందికొట్కూరు పట్టణ శివారులోని ఏబీయం పాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వచ్ఛందంగా ట్యూషన్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను అభినందిస్తూ, అక్కడ చదువుకుంటున్న 70 మంది నిరుపేద విద్యార్థులకు ఆయన కాపీ రైటింగ్ పుస్తకాలు మరియు జామెట్రీ కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించిన ఆయన, వారి భవిష్యత్తు ఆశయాలను అడిగి తెలుసుకున్నారు. చదువుపై ఇష్టంతో కష్టపడి చదివితేనే ఉన్నత స్థితికి చేరుకోగలరని, విద్యార్థుల ఉన్నత చదువులకు తన వంతు సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ప్రతి కుటుంబంలో కనీసం ఒక్కరైనా ఇంజనీర్ లేదా డాక్టర్ అయితే ఆ కుటుంబం పొందే గౌరవం, సంతోషం వర్ణనాతీతమని తెలిపారు. చిన్నతనం నుండే చదువుపై శ్రద్ధ చూపి గ్రామానికి, జిల్లాకు మరియు దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఆనంద్ కుమార్ గారికి కృతజ్ఞతలు తెలిపి, ఆయనతో ఉత్సాహంగా గడిపారు.

# క్యాతనపల్లి మున్సిపాలిటీ బీఆర్ఎస్ కైవసం

**నేటి సాక్షి, ఎండపల్లి:** మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గంలోని క్యాతనపల్లి మున్సిపాలిటీ పీఠాన్ని బీఆర్ఎస్ పార్టీ దక్కించుకుంది. కోర్టు ఆదేశాల మేరకు శనివారం నిర్వహించిన ఎన్నికల్లో బీఆర్ఎస్, సీపీఐ కూటమి విజయం సాధించింది. మున్సిపల్ చైర్మన్‌గా గోడిశెల సంధ్యారాణి (బీఆర్ఎస్), వైస్ చైర్మన్‌గా సరిత (సీపీఐ) ఎన్నికయ్యారు. ఈ గెలుపుతో బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొనగా, అధికార కాంగ్రెస్ పార్టీకి గట్టి షాక్ తగిలింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు ధర్మపురి నియోజకవర్గం నుండి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. వాహనాల ర్యాలీతో చెన్నూర్‌కు చేరుకున్న నేతలు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను కలిసి తమ మద్దతు ప్రకటించారు. అనంతరం ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్ మరియు కౌన్సిలర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సింహాచలం జగన్, గోస్కుల జలేందర్, చల్లూరి రామచంద్రం, రాచూరి శ్రీధర్ మరియు నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



TGTEL/25/A1737 | NETI SAKSHI



# నరాలు తెగే ఉత్కంఠ.. నెగ్గిన రాజస్థాన్!

## అహ్మదాబాద్‌లో పరుగుల వరద.. ఆఖర్లో ఆర్ఆర్ దే విజయం

### దంచికొట్టిన ధ్రువ్ జురెల్, జైస్వాల్

### నాలుగు వికెట్లతో జీటీని దెబ్బకొట్టిన రవి బిష్ణోయ్

### ఆఖరి వరకు పోరాడి ఓడిన గుజరాత్ టైటాన్స్

**అహ్మదాబాద్ :** ఐపీఎల్ టోర్నీలో భాగంగా అహ్మదాబాద్ నరేంద్ర మోడీ స్టేడియం వేదికగా శనివారం జరిగిన మ్యాచ్ లో గుజరాత్ టైటాన్స్ పై రాజస్థాన్ రాయల్స్ అద్భుత విజయం సాధించింది. ఉత్కంఠ భరితంగా సాగిన ఈ హై స్కోరింగ్ పోరులో ఆఖరి వరకు పోరాడిన జీటీ కేవలం 6 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్ఆర్ భారీ స్కోరు సాధించగా.. లక్ష్య ఛేదనలో జీటీ తడబడింది.



### ఆకాశమే హద్దుగా ఆర్ఆర్ బ్యాటింగ్

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 210 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ 36 బంతుల్లో 55 పరుగులతో శుభారంభం అందించగా.. ఆ తర్వాత వచ్చిన ధ్రువ్ జురెల్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 42 బంతుల్లోనే 75 పరుగులు సాధించి జీటీ బౌలర్లకు చుక్కలు చూపించాడు. చివర్లో వైభవ్ సూర్యవంశీ 18 బంతుల్లో 31 పరుగులతో రాణించాడు. గుజరాత్ బౌలర్లలో కగిసో రబడ 2 వికెట్లు తీయగా.. అశోక్ శర్మ, రషీద్ ఖాన్ తలో వికెట్ పడగొట్టారు.

### పోరాడి ఓడిన జీటీ

211 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్ ఓపెనర్ సాయి సుదర్శన్ అద్భుతమైన ఇన్నింగ్స్ తో ఆశలు రేపాడు. 44 బంతుల్లో 73 పరుగులు చేసి ఒంటరి పోరాటం చేశాడు. అతనికి తోడుగా జోస్ బట్లర్ 14 బంతుల్లో 26 పరుగులు, రషీద్ ఖాన్ 16 బంతుల్లో 24 పరుగులతో రాణించినా లాభం దక్కలేదు. మిగతా బ్యాటర్లు విఫలం కావడంతో నిర్ణీత 20 ఓవర్లలో జీటీ 8 వికెట్లు కోల్పోయి 204 పరుగులకే పరిమితమైంది.

### బిష్ణోయ్ స్పిన్ ఉచ్చు

ఆర్ఆర్ బౌలర్లలో స్పిన్నర్ రవి బిష్ణోయ్ అద్భుత ప్రదర్శన చేశాడు. కీలక సమయంలో వికెట్లు పడగొట్టి గుజరాత్ బ్యాటింగ్ లైనప్ ను దెబ్బతీశాడు. తన 4 ఓవర్ల కోటాలో 41 పరుగులిచ్చి ఏకంగా 4 వికెట్లు పడగొట్టి ఆర్ఆర్ విజయానికి బాటలు వేశాడు. తుషార్ దేశ్ పాండే, రియాన్ పరాగ్ చెరో వికెట్ తీసి అతనికి చక్కని సహకారం అందించారు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమష్టిగా రాణించిన రాజస్థాన్ రాయల్స్ సూపర్ విక్టరీని తమ ఖాతాలో వేసుకుంది.

# సెమీస్‌కు నిఖత్..

## భారత్‌కు మూడు పతకాలు ఖాయం

### ప్రియా, ప్రీతి జోరు

**ఉలన్‌బాతర్ :** ఆసియా బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు అదరగొడుతున్నారు. టోర్నీ ఐదో రోజు తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్‌తో పాటు ప్రియా, ప్రీతి పవార్ సైతం సెమీస్‌కు చేరి దేశానికి మూడు పతకాలు ఖాయం చేశారు. మహిళల 51 కిలోల క్యాటగిరీ క్వార్టర్ బౌట్‌లో ఆదినుంచే పూర్తి నియంత్రణతో ఆడిన నిఖత్.. రిఫరీ స్టాప్ కాంటెస్ట్ (ఆర్ఎఫ్‌సీ)తో ఫిలిప్పీన్స్‌కు చెందిన జియాన్ బగుహిన్‌ను ఓడించి సెమీస్ చేరింది. సెమీస్‌లో ఈ తెలంగాణ అమ్మాయి.. 2024 ఒలింపిక్స్ గోల్డ్ మెడలిస్ట్ అయిన వు యు (చైనా)తో అమీతుమీ తేల్చుకోనుంది. మహిళల 60 కిలోల విభాగంలో ప్రియ.. 4-1తో చెంగ్యు యాంగ్ (చైనా)ను చిత్తుచేసింది. ఫైనల్ బెర్తు కోసం ఆమె సెమీస్‌లో నమున్ మొంఖొర్ (మంగోలియా)తో తలపడుతుంది. 54 కేజీల క్యాటగిరీలో వరల్డ్ బాక్సింగ్ కప్ స్వర్ణ విజేత ప్రీతి.. 5-0తో మంగున్ సెత్సెగ్ (మంగోలియా)ను మట్టికరిపించి సెమీస్‌కు అర్హత సాధించింది.



# రిజ్వీ రాంపేజ్.. ముంబై పల్టీ!



## ఢిల్లీ క్యాపిటల్స్ ఆరు వికెట్ల ఘన విజయం

### 51 బంతుల్లో 90 పరుగులతో చెలరేగిన సమీర్ రిజ్వీ

### వృథా అయిన సూర్యకుమార్, రోహిత్ శర్మ పోరాటం

### సొంత గడ్డపై సత్తా చాటిన ఢిల్లీ బౌలర్లు, బ్యాటర్లు

**ఢిల్లీ, ఏప్రిల్ 4:** ఐపీఎల్ టోర్నీలో భాగంగా శనివారం అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన మ్యాచ్ లో ఢిల్లీ క్యాపిటల్స్ అద్భుత విజయం సాధించింది. ముంబై ఇండియన్స్ తో జరిగిన పోరులో ఆరు వికెట్ల తేడాతో గెలుపొందింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ముంబై నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో ఢిల్లీ బ్యాటర్ సమీర్ రిజ్వీ ఆకాశమే హద్దుగా చెలరేగడంతో ఆ జట్టు కేవలం 18.1 ఓవర్లలోనే నాలుగు వికెట్లు కోల్పోయి 164 పరుగులు చేసి లక్ష్యాన్ని ముద్దాడింది. మరో 11 బంతులు మిగిలి ఉండగానే ఢిల్లీ ఘన విజయాన్ని సొంతం చేసుకుంది.



### సూర్యకుమార్ హాఫ్ సెంచరీ

అంతకుముందు టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ బౌలింగ్ ఎంచుకున్నాడు. బ్యాటింగ్ కు దిగిన ముంబై ఇండియన్స్ కు శుభారంభం దక్కింది. స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ 36 బంతుల్లో 51 పరుగులతో అదరగొట్టాడు. మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ 26 బంతుల్లో 35 పరుగులతో రాణించాడు. యువ ఆటగాడు నమన్ ధీర్ 21 బంతుల్లో 28 పరుగులు సాధించాడు. మిగతా బ్యాటర్లు పెద్దగా రాణించకపోవడంతో ముంబై 162 పరుగులకే పరిమితమైంది. ఢిల్లీ బౌలర్లలో ముకేశ్ కుమార్ మూడు ఓవర్లలో 26 పరుగులిచ్చి రెండు వికెట్లు తీశాడు. అక్షర్ పటేల్ నాలుగు ఓవర్లలో 22 పరుగులిచ్చి ఒక వికెట్ పడగొట్టాడు. విప్రాజ్ నిగమ్ మూడు ఓవర్లలో 24 పరుగులిచ్చి ఒక వికెట్ దక్కించుకున్నాడు. కట్టుదిట్టమైన బౌలింగ్ తో ముంబై భారీ స్కోరు చేయకుండా ఢిల్లీ బౌలర్లు అడ్డుకున్నారు.



### సమీర్ రిజ్వీ విధ్వంసం

163 పరుగుల మోస్తరు లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ కు సమీర్ రిజ్వీ అద్భుతమైన ఇన్నింగ్స్ తో విజయాన్ని కట్టబెట్టాడు. ముంబై బౌలర్లను ఊచకోత కోస్తూ కేవలం 51 బంతుల్లోనే 90 పరుగులు చేశాడు. సెంచరీకి చేరువలో అవుటైనప్పటికీ జట్టుకు సునాయాస విజయాన్ని అందించాడు. అతడికి జతగా ఓపెనర్ పాతుమ్ నిస్సాంక 30 బంతుల్లో 44 పరుగ్గులతో మంచి పునాది వేశాడు. చివర్లో డేవిడ్ మిల్లర్ 18 బంతులోగ 21 పరుగులతో అజేయంగా నిలిచి లాంఛనాన్ని పూర్తి చేశాడు.

### తేలిపోయిన ముంబై బౌలర్లు

ఢిల్లీ బ్యాటర్ల ధాటికి ముంబై బౌలర్లు చేతులెత్తేశారు. దీపక్ చాహర్ మూడు ఓవర్లలో 20 పరుగులిచ్చి ఒక వికెట్, మిచెల్ శాంట్నర్ మూడు ఓవర్లలో 22 పరుగులిచ్చి ఒక వికెట్ మాత్రమే తీశారు. కార్బిన్ బాష్ 3.1 ఓవర్లలో ఏకంగా 39 పరుగులు సమర్పించుకుని ఒక వికెట్ పడగొట్టాడు. రిజ్వీ దెబ్బకు బౌలర్ల వ్యూహాలన్నీ బెడిసికొట్టాయి. అద్భుతమైన బ్యాటింగ్ తో ఒంటిచేత్తో ఢిల్లీకి విజయాన్ని అందించిన సమీర్ రిజ్వీకి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.








# 10న డెకాయిట్ విడుదల

### ట్రైలర్ విడుదల చేసిన చిత్ర బృందం

అడివి శేష్ హీరోగా రానున్న రొమాంటిక్ యాక్షన్ మూవీ 'డెకాయిట్' షానీల్ డియో దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించారు. ఏప్రిల్ 10న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను విడుదల చేశారు. వరుస విజయాలతో బాక్సాఫీస్ వద్ద తనకంటూ ఒక ప్రత్యేక బ్రాండ్‌ను క్రియేట్ చేసుకున్న హీరో అడివి శేష్. తన తదుపరి చిత్రం 'డెకాయిట్' తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. మృణాల్ ఠాకూర్‌తో ఆయన కెమిస్ట్రీ ఈ సినిమాకు మెయిన్ హైలైట్ కానుంది. ఈ చిత్రంతో ఏప్రిల్ 10న విడుదల కాబోతున్న తరుణంలో శేష్ వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నారు. ఇందులో భాగంగా ఓ ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణంలోని కీలక విషయాలను పంచుకున్నారు. ముఖ్యంగా తన సినిమాలను నమ్మి పెట్టుబడి పెట్టిన నిర్మాతలకు ఇప్పటివరకు నష్టాలు రాలేదని ఆయన గర్వంగా చెప్పుకొచ్చారు. 'ఇప్పటివరకు నాతో పని చేసిన ప్రొడ్యూసర్స్ అందరూ లాభాలు గడించారు. వాళ్ళు పెట్టిన ప్రతి రూపాయికి న్యాయం జరిగిందని నేను నమ్ముతున్నాను' అని శేష్ పేర్కొన్నారు. కేవలం నటుడిగానే కాకుండా, స్క్రిప్ట్ విషయంలో కూడా శేష్ తీసుకునే జాగ్రత్తలే ఆయన సినిమాల మినిమమ్ గ్యారెంటీ సక్సెస్‌కు కారణమని ఇండస్ట్రీ టాక్. అలాగే తన కెరీర్‌లో మర్చిపోలేని సినిమా గురించి ప్రస్తావిస్తూ.. గూఢచారి నా జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. ఆ సినిమా ఇచ్చిన సక్సెస్ వల్లే ఈరోజు నేను ఇలాంటి భారీ ప్రాజెక్టులు చేయగలుగుతున్నాను' అని ఎమోషనల్ అయ్యారు. ఆ సినిమాతో వచ్చిన గుర్తింపు శేష్‌ను కేవలం తెలుగులోనే కాకుండా పాన్ ఇండియా స్థాయిలో ఒక నమ్మకమైన హీరోగా నిలబెట్టిందన్నారు.

# ఎల్లమ్మ కథకు దేవిశ్రీ అయితేనే సరిపోతాడు

### క్లారిటీ ఇచ్చిన దర్శకుడు బలగం వేణు



'బలగం' సినిమాతో ప్రేక్షకుల హృదయాలను హత్తుకున్న దర్శకుడు వేణు ఎల్దండి తన తదుపరి ప్రాజెక్ట్ 'ఎల్లమ్మ'తో మరోసారి భారీ అంచనాలను సృష్టిస్తున్నారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా చిత్రంపై ఇప్పటికే ఇండస్ట్రీలో హాట్ టాపిక్ నడుస్తోంది. ఈ సినిమాలో హీరోగా నాని, నితిన్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్ వంటి స్టార్స్ నటిస్తారని గతంలో ప్రచారం జరిగింది. అయితే అందరినీ ఆశ్చర్యపరుస్తూ, దర్శకుడు వేణు ఈ పాత్ర కోసం దేవి శ్రీ ప్రసాద్‌ని ఎంపిక చేశారు. ప్రపంచవ్యాప్తంగా సంగీత దర్శకుడిగా గుర్తింపు పొందిన దేవి శ్రీ ప్రసాద్ ఈ చిత్రంతో హీరోగా కొత్త ప్రయాణం ప్రారంభించ బోతున్నారు. ఇది ఆయన కెరీర్‌లో కీలక మలుపుగా భావిస్తున్నారు. ఈ నిర్ణయంపై వస్తున్న సందేహాలకు దర్శకుడు వేణు క్లారిటీ ఇచ్చారు. సినిమాలో తీసుకునే ప్రతి నిర్ణయం కథకు అనుగుణంగానే ఉంటుంది. 'ఎల్లమ్మ' కథకు ఒక ప్రత్యేకమైన బాడీ లాంగ్వేజ్ ఉన్న వ్యక్తి కావాలి. మొదట వేరే నటులను అనుకున్నా? కథ మారుతూ ఉండటంతో దేవి శ్రీ ప్రసాద్ అయితేనే సరిపోతారని భావించాం అని తెలిపారు. కథలోని సహజత్వం, భావోద్వేగాలను ప్రేక్షకులకు బలంగా చేరవేయడానికి దేవి సరైన ఎంపికగా కనిపించారని ఆయన వివరించారు. బలగంతో గ్రామీణ భావోద్వేగాలను అద్భుతంగా చూపించిన వేణు? 'ఎల్లమ్మ'లో కూడా అదే మట్టి వాసనను తెరపై ఆవిష్కరించబోతున్నారు. ఈ సినిమా కూడా ఎమోషనల్ డ్రామాగా ఉండబోతుందని సమాచారం. సంగీత దర్శకుడిగా ఎనలేని క్రేజ్ సంపాదించిన దేవి శ్రీ ప్రసాద్‌ని నటుడిగా ఎలా చూపిస్తారు? ఆయన పాత్రలో ఎంతవరకు ఒదిగిపోతారు? అన్న ఆసక్తి అభిమానుల్లో పెరుగుతోంది. టాలీవుడ్‌లో కొత్త ప్రయోగాలలు ఎప్పుడు అందరిలో ఆసక్తిని కలిగిస్తుంటాయనే విషయం మనకు తెలిసిందే. ఈ క్రమంలో వేణు దేవి శ్రీ ప్రసాద్ కాంబినేషన్ ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తిస్తోంది.







# రాముడు, పరశురాముడు.. రణ్‌బీర్ కపూరే

### ద్విపాత్రాభినయం గురించి వెల్లడించిన రణ్‌బీర్

ప్రకటించిన నాటినుంచే అందరి దృష్టిని ఆకర్షిస్తోంది 'రామాయణ'. ఇటీవల దీని టీజర్ విడుదలై మంచి స్పందనను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ ప్రాజెక్ట్ గురించి రణ్‌బీర్ ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. ఇందులో ఆయన ద్విపాత్రాభినయం చేసినట్లు తెలిపారు. ఇందులో రణ్‌బీర్ శ్రీరాముడితో పాటు పరశురాముడి పాత్రను కూడా పోషిస్తున్నట్లు స్వయంగా వెల్లడించారు. 'శ్రీ మహావిష్ణువు ఆరో అవతారం పరశు రాముడు. ఈ సినిమాలో శ్రీరాముడితో పాటు పరశు రాముడిగా కూడా నటించే అవకాశం రావడం నిజంగా నా అదృష్టంగా భావిస్తున్నా. ఇలాంటి సినిమాల్లో నటించేటప్పుడు బాడీ లాంగ్వేజ్ మాత్రమే కాదు.. ఆ పాత్రల వెనక ఉన్న ఆధ్యాత్మికతను, భావోద్వేగాలను లోతుగా అర్థం చేసుకోవడం ముఖ్యం. 'రామాయణ' చిత్రీకరణకు ముందు ఏడాది పాటు ఆ పాత్రల గురించి బాగా తెలుసుకున్నానని రణ్‌బీర్ తెలిపారు. ప్రస్తుతం 'రామాయణ'కు సంబంధించిన మరో వార్త కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సినిమా కోసం ఓ ఓటీటీ సంస్థ భారీ డీల్‌కు ముందుకు వచ్చిందిట. కానీ, నిర్మాత నమిత్ మల్హోత్రా ఆ డీల్‌ను తిరస్కరించినట్లు తెలుస్తోంది. రెండు భాగాలకు కలిపి ఓటీటీ సంస్థ రూ.1000 కోట్లకు అడగ్గా.. ఆయన దాన్ని తిరస్కరించారట. ఈ డిజిటల్ హక్కుల విషయంలో ఆయన 'ధురంధర్' చిత్రబృందం వ్యూహాన్ని అనుసరించాలని చూస్తున్నట్లు బాలీవుడ్ మీడియా పేర్కొంది. మొదట పార్ట్ వన్‌తో డీల్ కుదుర్చుకుని అది విడుదలైన తర్వాత దానికి వచ్చిన స్పందనను బట్టి రెండో భాగానికి ఒప్పందం కుదుర్చుకోవచ్చని నిర్మాత భావిస్తున్నట్లు సమాచారం. రూ.4000 కోట్లతో అత్యంత భారీ బ్జడెట్‌తో ఈ ప్రాజెక్ట్ రానుంది. ఇప్పటికే మొదటి భాగం చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం దాని వీఎఫ్ఎక్స్ పనులు జరుగుతున్నాయి. రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ , సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీదేవోల్ నటిస్తున్నారు. కైకేయిగా లారాదత్తా, శూర్పణఖగా రకుల్‌ప్రీత్‌సింగ్ కనిపించనున్నట్లు తెలుస్తోంది. మొదటి పార్ట్ ఈ ఏడాది దీపావళికి, రెండోది 2027 దీపావళికి విడుదల కానున్నాయి. తాజాగా ఈ సినిమా రన్‌టైంకి సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ఇటీవల అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో హాలీవుడ్ మీడియాతో 'రామాయణ్' సినిమా విశేషాలను పంచుకుంటున్న సమయంలో.. రణ్‌బీర్ కపూర్ అతడికి తెలియకుండానే సినిమా రన్‌టైం గురించి నోరు జారడు. ఈ సినిమా గురించి రణ్‌బీర్ మాట్లాడుతూ.. దాదాపు 6 గంటల ఎపిక్ విజువల్స్‌తో ఈ సినిమా రాబోతుంది. రామాయణం అనేది ఒక మహా కావ్యం. దీనిని ఏమాత్రం కుదించకుండా, ప్రతి కీలక ఘట్టాన్ని అద్భుతంగా వెండితెరపై ఆవిష్కరించేందుకే మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని రణ్‌బీర్ తెలిపాడు.




# రామాయణం మూలకథ నుంచి తప్పుకోరాదు

### ఆదిపురుష్ తప్పలను రామాయణలో చేయరాదు

ప్రభాస్ కథానాయకుడిగా ఓం రౌత్ దర్శకత్వంలో వచ్చిన 'ఆదిపురుష్' సినిమాపై దేశవ్యాప్తంగా తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా డైరెక్టర్ నితీష్ తివారీ తెరకెక్కిస్తున్న 'రామాయణ్' టీజర్‌పై దివంగత నటుడు దారసింగ్ కుమారుడు, నటుడు విందు దారసింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఇటీవల విడుదలైన రామ టీజర్‌లో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడి లుక్ అద్భుతంగా ఉందంటూ ప్రశంసించిన ఆయన.. అదే సమయంలో మేకర్స్‌కు ఒక సున్నితమైన హెచ్చరిక చేశాడు. రామాయణం వంటి పవిత్ర కావ్యాన్ని తెరకెక్కించేటప్పుడు మూల కథ నుంచి ఏమాత్రం పక్కకు జరిగినా ప్రేక్షకులు అస్సలు ఒప్పుకోరని ఆయన స్పష్టం చేశాడు. దిగ్గజ నటుడు దారసింగ్.. గతంలో రామానంద్ సాగర్ రూపొందించిన 'రామాయణ్' సీరియల్‌లో హనుమంతుడి పాత్రలో జీవించి ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేశారు. ఆ జ్ఞాపకాలను గుర్తుచేసుకున్న విందు మాట్లాడుతూ.. రామాయణ్ టీజర్ చాలా అద్భుతంగా, ఎంతో అందంగా ఉంది. అయితే ఇక్కడ ఒక కఠినమైన నియమం ఉంది. రామానంద్ సాగర్ గారు తీసిన రామాయణం మనందరి హృదయాల్లో, మనస్సుల్లో బలంగా నాటుకుపోయింది. అది ఒక చరిత్ర, ఎప్పటికీ నెంబర్ వన్. ఇప్పుడు రాబోతున్న సినిమా ఆ స్థాయిని అందుకుంటే మాత్రం రికార్డులను తిరగరాసే సూపర్ హిట్ అవుతుంది. కానీ కథలో అనవసర మార్పులు చేసినా, పాత్రలను మరీ భయంకరంగా అసురుల తరహాలో చూపించినా జనాలు అస్సలు అంగీకరించరు అని విందు పేర్కొన్నాడు. గతంలో వచ్చిన 'ఆదిపురుష్' సినిమాను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు నేను చూసిన దాన్ని బట్టి తివారీ గారి 'రామాయణ్' చాలా మెరుగ్గా కనిపిస్తోంది. అసలు ఆదిపురుష్‌లో ఏం చూపించారో నాకే అర్థం కాలేదు. ఆ ట్రైలర్ చూసినప్పుడే ఆ సినిమా ఫ్లాప్ అవుతుందని నాకు అర్థమైపోయిందన్నారు.

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

# మాకుల తండా జాతర పోస్టర్‌కు విశేష స్పందన



- తమ దేవతల పేర్లు మార్చవద్దంటూ గిరిజన తండాల్లో మొదలైన ఆత్మగౌరవ పోరాటం
- ఈనెల 15న మాకుల క్షేత్రంలో భారీ ఎత్తున లంబాడీల ఆత్మగౌరవ సదస్సు నిర్వహణ

**నేటి సాక్షి, మహబూబాబాద్ :** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పరిధిలోని మాకుల తండాలో నిర్వహించనున్న భావసంగ్ మహారాజ్ – మ్యారమా భవానీ జాతర పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాలు గిరిజన ప్రాంతాల్లో కొత్త చర్చకు దారితీస్తున్నాయి. లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర ముఖ్య సమన్వయకర్త జాదవ్ రమేష్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ప్రచారానికి ఊహించని స్థాయిలో స్పందన లభిస్తోంది. తమ సంప్రదాయాలు, దేవతల పేర్లను మార్చడానికి వీల్లేదని, మ్యారమా భవానీ పేరును జాతరలో తప్పనిసరిగా కొనసాగించాలని గిరిజనులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ఈ ప్రచారంలో భాగంగా బాల్య తండా, భద్ర తండా, చీప్లా తండా వంటి పలు ప్రాంతాల్లో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచులు మలోత్ రమేష్ నాయక్, ధారావత్ రాధాకృష్ణ మాట్లాడుతూ.. తమ సంస్కృతిని కాపాడుకోవడం ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని పేర్కొన్నారు. ఈ నెల 15వ తేదీన మాకుల తండాలో జరిగే "బంద్లు తిరిగే కార్యక్రమం" సందర్భంగా భారీ ఎత్తున లంబాడీల ఆత్మగౌరవ సదస్సును నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన నాయకులు నరేష్ నాయక్, వాగ్య నాయక్ మరియు వివిధ తండాల పెద్దలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# బిజెపి కార్యకర్తకు లేజర్ ఆపరేషన్

- గాయపడిన యువకుడికి డా. అనూప్ రావు అండ
- కోరుట్లలో 'వీర హనుమాన్ విజయయాత్ర'లో ప్రమాదం
- తక్షణ స్పందనతో ప్రాణాపాయం తప్పించుకున్న యువకుడు



**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణంలో ఇటీవల నిర్వహించిన 'వీర హనుమాన్ విజయయాత్ర'లో ప్రమాదవశాత్తు గాయపడిన యువకార్యకర్తకి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డా. అనూప్ రావు అండగా నిలిచి తన సొంత ఖర్చుతో శస్త్రచికిత్స చేయించడం స్థానికంగా ప్రశంసలు అందుకుంటోంది. కోరుట్ల పట్టణంలో జరిగిన 'వీర హనుమాన్ విజయయాత్ర' సందర్భంగా గుర్రాల రాజ్‌కుమార్ ప్రమాదవశాత్తు ముక్కుపై తీవ్ర గాయానికి గురయ్యాడు. సంఘటన చోటుచేసుకున్న వెంటనే స్పందించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డా. అనూప్ రావు, గాయపడిన యువకుడిని కోరుట్లలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స అవసరమని గుర్తించి వెంటనే తదుపరి చర్యలు చేపట్టారు. యువకుడి పరిస్థితి విషమంగా ఉండటంతో డా. అనూప్ రావు స్వయంగా ముందుండి గాయపడిన యువకుడిని కరీంనగర్‌కు తరలించి అక్కడి ప్రముఖ ఈఎన్టీ ఆసుపత్రిలో లేజర్ ఆపరేషన్ చేయించారు. ఈ చికిత్స కోసం సుమారు లక్ష రూపాయలకు పైగా ఖర్చును తన సొంతంగా భరించడం విశేషం. సమయోచితంగా తీసుకున్న ఈ నిర్ణయం వల్ల బాధితుడు ఆరోగ్యంగా కోలుకుంటున్నట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కస్తూరి లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఓబీసీ ఉపాధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, కౌన్సిలర్ ఇందూరి తిరుమల వాసు, మాజీ కౌన్సిలర్ మాడవేణి నరేష్, నాయకులు సుదవేణి మహేష్, గిన్నెల శ్రీకాంత్, తులసి కృష్ణ, బెక్కం అశోక్ తదితరులు పాల్గొన్నారు. గాయపడిన యువకుడి ఆరోగ్యంపై వారు ఆరా తీశారు. ఈ సందర్భంగా కోరుట్ల భజరంగ్ దళ్ నాయకులు డా. అనూప్ రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కల్లెడ రోహిత్, పల్లికొండ వెంకటేష్, రాచకొండ చందు, కళ్యాణ్ తదితరులు మాట్లాడుతూ, ప్రమాద సమయంలో వెంటనే స్పందించి సహాయం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని వారు అభిప్రాయపడ్డారు.

# తీలేరులో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ





**నేటి సాక్షి, నారాయణపేట, (ఇమామ్ సాబ్):** మరికల్ మండలం తీలేరు గ్రామంలో శనివారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. నారాయణపేట జిల్లా డీసీసీ అధ్యక్షుడు కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఈ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో భరోసానిస్తుందని పేర్కొన్నారు. అలాగే, త్వరలోనే జిల్లా డీసీసీ కార్యవర్గాన్ని ప్రకటించనున్నామని, మండల స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు కమిటీలను ఏర్పాటు చేసి, పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు తగిన గుర్తింపు మరియు న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రేవతమ్మ తన ఎన్నికల హామీని నిలబెట్టుకుంటూ ఒక నిరుపేద కుటుంబానికి గ్యాస్ సిలిండర్‌ను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సూర్య మోహన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆంజనేయులు, మాజీ ఉపసర్పంచ్ బజరప్ప, మరికల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వీరన్న మరియు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సాయం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

# మహనీయుల జయంతి విజయవంతం చేయాలి

## ఉత్సవ సమితి అధ్యక్షులు రామచందర్



**నేటి సాక్షి, వికారాబాద్:** ఏప్రిల్ మాసంలో జరగనున్న బాబు జగ్జీవన్ రామ్ మరియు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాలను జిల్లా ప్రజలందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని జయంతి ఉత్సవ సమితి అధ్యక్షుడు రామచందర్ పిలుపునిచ్చారు. శనివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 5న బాబు జగ్జీవన్ రామ్ జయంతి, ఏప్రిల్ 14న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ జయంతి ఉత్సవాల్లో ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహనీయులకు నివాళులర్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి పుష్పలత, మాజీ చైర్మన్ సి. జగదీష్, మిద్దె రాములు, అడ్వకేట్ అశోక్, తిమ్మాని శంకర్, సిపిఎం జిల్లా అధ్యక్షులు ఆర్. మహిపాల్, బిఆర్ఎస్ నాయకులు పాడిగల అశోక్, ఎర్రోళ్ల ఆనంద్ మరియు ఇతర సభ్యులు పాల్గొన్నారు. మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.

# గంగమ్మకు మండల పూజ



**నేటి సాక్షి, చౌడేపల్లి:** చౌడేపల్లి మండలంలోని బత్తలాపురంలో నూతనంగా నిర్మించిన బోయకొండ గంగమ్మ ఆలయంలో శనివారం మండల పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రతిష్ఠాపన జరిగి 42 రోజులు పూర్తయిన సందర్భంగా గ్రామస్థులు, వేద పండితుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా చేపట్టారు. ఉదయాన్నే భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారికి విశేష అభిషేకాలు, అలంకరణలు చేశారు. ఈ వేడుక కోసం ఆలయాన్ని పుష్పాలు, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తిశ్రద్ధల నడుమ జరిగిన ఈ పూజా కార్యక్రమాలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# పోలీసుల అవగాహన సదస్సు



**నేటి సాక్షి, కొమురం భీమ్ ఆసిఫాబాద్ (ఎండి ముబీన్):** సిర్పూర్-టి ఎస్సై సాగర్ ఆధ్వర్యంలో శనివారం లొనవెల్లి గ్రామంలో ప్రజలకు సైబర్ నేరాలు మరియు ఇతర సామాజికాంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీలు, బ్యాంక్ వివరాలు చెప్పి మోసపోవద్దని, సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అత్యవసర సమయాల్లో డయల్ 100 సేవలను వినియోగించుకోవాలని కోరారు. గంజాయి వంటి మత్తు పదార్థాల రవాణా, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే, రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోలీసుల సూచనలను స్వీకరించారు.

# వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి



**నేటి సాక్షి, నల్లబెల్లి:** నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు మేడిపల్లి ఐలయ్య గౌడ్, సుమతి దంపతుల చిన్న కుమారుడు లక్ష్మణ్ గౌడ్ వివాహ వేడుక శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన వధూవరులు లక్ష్మణ్ గౌడ్, బేబీలను ఆయన పూలమాలలతో అభినందించి, అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగెల్లి జ్యోతి ప్రకాష్, మాజీ సర్పంచ్ రాజారామ్, గ్రామ పార్టీ అధ్యక్షులు క్యాతం శ్రీను, నాయకులు కోటి, పిట్టల ప్రవీణ్, సద్దాం, మధు, హరీష్ తదితరులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# టీడీపీలో ఐక్యత అవసరం



నేటి సాక్షి : చిన్నతుంబలం టీడీపీలో భేదాభిప్రాయాలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ ఏకధాటిగా ముందుకు సాగాల్సిన సమయం ఆసన్నమైందని టీడీపీ రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం చిన్నతుంబలంలో సర్పంచ్ పదవీకాలం ముగిసిన సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలే ప్రధాన లక్ష్యంగా పని చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. చిన్న చిన్న మనస్పర్థలతో పార్టీకి దూరంగా ఉండటం మంచిది కాదని, అందరూ ఐక్యంగా పనిచేస్తేనే విజయాలు సాధ్యమవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువనేత దివాకర్ రెడ్డితో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తిర్యాని పోలీస్ స్టేషన్ తనిఖీ

**జిల్లా ఎస్పీ నితికా పంత్**




**నేటి సాక్షి, కొమురం భీమ్ ఆసిఫాబాద్ (ఎండి ముబీన్):** జిల్లా ఎస్పీ నితికా పంత్ శనివారం తిర్యాని పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి సమగ్ర తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతి, మరియు పరిసరాల శుభ్రతను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఎస్హెచ్ఓ వెంకటేష్ మరియు సిబ్బందితో సమీక్ష నిర్వహించి, విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడకూడదని, అసాంఘిక కార్యకలాపాలు మరియు మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై కఠిన నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా మహిళలు, బాలికల భద్రతకు సంబంధించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. గ్రామాల్లో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలని, రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని ఆదేశించారు. ప్రజల విశ్వాసాన్ని పెంపొందించేలా పోలీసు సేవలు ఉండాలని, చట్టవిరుద్ధ పనులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

# సహాయ నిధి చెక్కు పంపిణీ

**లబ్ధిదారునికి రూ. 60 వేల ఆర్థిక సాయం**



**నేటి సాక్షి, నారాయణపేట,(ఇమామ్ సాబ్):** నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికా రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు మరికల్ మండలం మాధవరం గ్రామానికి చెందిన కస్తుల శ్రీనివాసులుకు మంజూరైన రూ. 60,000 ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును శనివారం పంపిణీ చేశారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎస్. సూర్య మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఈ చెక్కును లబ్ధిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి మానవతా దృక్పథంతో అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మరికల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వీరన్న, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాటేకొండ ఆంజనేయులు, పట్టణ అధ్యక్షుడు హరీష్ కుమార్, మాధవరం సర్పంచ్ మోగులయ్య పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ నాయకులు పోలెమోని రామకృష్ణ, గొల్ల రాజు, పెంటమిది రఘు, పేరి రామకృష్ణారెడ్డి, జంగిడి రవి, గూప కురమయ్య, మూర్తి, రఘు, బాలయ్య తదితరులు పాల్గొని ప్రభుత్వ పథకాలపై హర్షం వ్యక్తం చేశారు.

# చందుర్తి పోలీస్ స్టేషన్ తనిఖీ

**ఎస్పీ మహేష్ బి. గితే**



**నేటి సాక్షి, చందుర్తి (సతీష్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే శనివారం చందుర్తి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి దిశానిర్దేశం చేస్తూ.. డయల్ 112 ద్వారా వచ్చే ఫిర్యాదులకు బ్లూ కోల్ట్స్ మరియు పెట్రోలింగ్ సిబ్బంది తక్షణమే స్పందించాలని ఆదేశించారు. రౌడీ షీటర్లపై నిరంతర నిఘా ఉంచాలని, విలేజ్ పోలీస్ ఆఫీసర్ (వూా) వ్యవస్థ ద్వారా గ్రామాల్లో నేర నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలకు పూర్తిగా చెక్ పెట్టాలని ఎస్పీ సూచించారు. బాధితుల నుండి వచ్చే ఫిర్యాదులపై ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా తక్షణమే స్పందించి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, సి.ఐ వెంకటేశ్వర్లు, ఎస్.ఐ రమేష్ మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# హరితహారం మొక్కలు ధ్వంసం

**వ్యక్తికి జరిమానా**



**నేటి సాక్షి, గన్నేరువరం:** గన్నేరువరం మండల కేంద్రంలో హరితహారం మొక్కలను ధ్వంసం చేసిన ఘటనపై గ్రామ సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ, పాలకవర్గ సభ్యులు మరియు అధికారులు తక్షణమే స్పందించారు. గ్రామానికి చెందిన పొన్నాల మధు అనే వ్యక్తి మొక్కలను నరికివేసినట్లు గుర్తించిన పంచాయతీ కార్యదర్శి రాజేష్, సంఘటనా స్థలాన్ని పరిశీలించి సదరు వ్యక్తికి నోటీసులు జారీ చేయడంతో పాటు జరిమానా విధించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆశయాలకు విరుద్ధంగా చెట్లను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా నాటిన మొక్కలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. తక్షణమే స్పందించి చర్యలు తీసుకున్న అధికారుల తీరుపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# గోదావరి పుష్కరాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలి

- దక్షిణాది కుంభమేళా తరహాలో ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి గడ్డం వివేకానంద ఆదేశం
- పుష్కరాల కోసం ప్రభుత్వం రూ. 500 కోట్ల ప్రత్యేక నిధులు కేటాయింపు



**నేటి సాక్షి, చెన్నూర్ :** గోదావరి పుష్కరాల నిర్వహణకు పూర్తిస్థాయి కార్యచరణ సిద్ధం చేయాలని రాష్ట్ర కార్మిక, గనులు మరియు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అధికారులను ఆదేశించారు. శనివారం మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండల కేంద్రంలోని గోదావరి నది తీరంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మరియు ఇతర శాఖల అధికారులతో కలిసి ఆయన పుష్కర ఘాట్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గోదావరి పుష్కరాలు దక్షిణాది కుంభమేళా వంటివని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా లైటింగ్, తాగునీరు, పారిశుద్ధ్య మరియు రవాణా సౌకర్యాలను మెరుగుపరచాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా పుష్కరాల కోసం ప్రభుత్వం రూ. 500 కోట్ల నిధులు కేటాయించిందని, క్యాబినెట్ సబ్ కమిటీ ద్వారా పనులను పర్యవేక్షిస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ.. చెన్నూర్ తీరంలో రోజుకు సుమారు 2 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా పార్కింగ్, రహదారుల విస్తరణ మరియు శాశ్వత ప్రాతిపదికన మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదుల నిర్మాణం చేపడతామని తెలిపారు. ఫిబ్రవరి 2027 నాటికి అన్ని పనులను పూర్తి చేస్తామని వివరించారు. అనంతరం మంత్రి పట్టణంలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం, 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి మరియు ఆర్టీసీ బస్ డిపో పనులను పరిశీలించి, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రావు, ఏసీపీ వెంకటేశ్వర్లు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కేసీఆర్ క్యాంపు కార్యాలయంపై దాడి హేయం

- మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్
- ప్రభుత్వ వైఫల్యాల నుండి ప్రజల దృష్టి మళ్లించేందుకే దాడుల కుట్ర
- హింసను ప్రేరేపిస్తున్న రేవంత్ రెడ్డికి ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరిక



**నేటి సాక్షి, వికారాబాద్:** బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణులు జరిపిన దాడిని వికారాబాద్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ తీవ్రంగా ఖండించారు. శనివారం ఆయన వికారాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు గుండాల్లా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కార్యాలయంలోని ఫర్నిచర్ ధ్వంసం చేయాల్సిన అవసరం ఏముందని ఆయన ప్రశ్నించారు. గతంలో కేటీఆర్, హరీశ్ రావు కార్యాలయాలపైన కూడా ఇలాగే దాడులు జరిగాయని, ఇది ముందస్తు ప్రణాళికతో జరుగుతున్న కుట్ర అని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి, ప్రజల దృష్టిని మళ్లించడానికి ఇలాంటి హింసాత్మక చర్యలకు పాల్పడుతోందని మెతుకు ఆనంద్ విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నైజం ప్రకారం రాష్ట్రంలో అలజడి సృష్టించాలని చూస్తున్నారని, అయితే ఇలాంటి చిల్లర వేషాలకు బిఆర్ఎస్ కార్యకర్తలు భయపడరని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ కాంగ్రెస్ ఎమ్మెల్యేల కార్యాలయాలపై దాడులు జరగలేదని గుర్తు చేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డికి ప్రజలు సరైన సమయంలో వడ్డీతో సహా చెల్లిస్తారని, ఇప్పటికైనా వక్రబుద్ధి మానుకుని ప్రజాసేవపై దృష్టి పెట్టాలని ఆయన హితవు పలికారు.

# అభివృద్ధి పథంలో వికారాబాద్ పురపాలక సంఘం




- మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహణ
- 14 అంశాలతో కూడిన ఎజెండాకు కౌన్సిల్ సభ్యుల ఏకగ్రీవ ఆమోదం
- వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని అధికారులకు చైర్‌పర్సన్ ఆదేశం
- ఆస్తి పన్ను వసూళ్లలో ప్రతిభ చాటిన బిల్ కలెక్టర్లకు ఘనంగా సన్మానం

**నేటి సాక్షి, వికారాబాద్:** వికారాబాద్ పురపాలక సంఘం కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం చైర్‌పర్సన్ గడ్డం అనన్య అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ గంగుల విక్రమ సింహా రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ అర్ధ సుధాకర్ రెడ్డి మరియు కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు. సమావేశంలో ప్రవేశపెట్టిన 14 ప్రధాన అంశాలతో కూడిన ఎజెండాను సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణంలో ఎక్కడా నీటి సరఫరాకు ఆటంకం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వీధి దీపాల నిర్వహణ సక్రమంగా ఉండాలని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలను వార్డు అధికారులు మరియు కౌన్సిల్ సభ్యుల సమన్వయంతో తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ప్రజలు తమ వాటర్ ట్యాక్స్ బకాయిలను ఆరు నెలల లోపు దశలవారీగా చెల్లించాలని కోరారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 90 శాతానికి పైగా ఆస్తి పన్నులు వసూలు చేసి మున్సిపాలిటీకి ఆదాయం చేకూర్చిన బిల్ కలెక్టర్లను చైర్‌పర్సన్ మరియు కమిషనర్ ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. పట్టణ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల ముఖ్య అధికారులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సుల్లో వయోవృద్ధులకు రాయితీలు పునరుద్ధరించాలి

- మంచిర్యాల జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం
- మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించిన సర్కారు.. వృద్ధులపై కూడా కనికరించాలని వినతి
- గతంలో ఉన్న రాయితీలను నిలిపివేయడంపై సీనియర్ సిటిజన్ల ఆవేదన
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే స్పందించాలని డిమాండ్



**నేటి సాక్షి, మంచిర్యాల (శ్రీధర్ దమ్ము):** తెలంగాణ రాష్ట్రంలో వయోవృద్ధులకు గతంలో అమల్లో ఉన్న ఆర్టీసీ బస్సు ప్రయాణ రాయితీలను వెంటనే పునరుద్ధరించాలని సీనియర్ సిటిజన్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన వయోవృద్ధుల సంక్షేమ సంఘం సమావేశంలో ఈ మేరకు కీలక తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సంఘం నేతలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం అభినందనీయమని, దీనివల్ల కోట్ల రూపాయల ఆర్థిక భారం తగ్గిందని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత సౌకర్యం కల్పించిన ప్రభుత్వం, వయోవృద్ధుల పట్ల ఎందుకు వివక్ష చూపుతోందని వారు ప్రశ్నించారు. గతంలో ఉన్న రాయితీలను కూడా నిలిపివేయడం వల్ల వృద్ధులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి వయోవృద్ధులు కూడా కీలక పాత్ర పోషించారని, ముఖ్యమంత్రి మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు ఈ విషయాన్ని గమనించి ఇతర రాష్ట్రాల్లో ఉన్నట్లుగానే ఇక్కడ కూడా రాయితీలు కల్పించాలని కోరారు. సింగరేణి విశ్రాంత ఉద్యోగులతో సహా రాష్ట్రంలోని వయోవృద్ధులందరికీ ఈ సౌకర్యం వర్తింపజేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వయోవృద్ధుల సంక్షేమ సంఘం, సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, ఉపాధ్యక్షుడు జెట్టి మురహరి, కార్యదర్శి ఆర్. రాజన్నతో పాటు నాయకులు ఆది రాజయ్య, మాదరబోయిన మల్లేష్, గుజ్జ శంకర్, ముత్యాల రాయమల్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వయోవృద్ధుల ఐక్యత వర్ధిల్లాలని, రాయితీలు కల్పించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI
కరీంనగర్ | ఆదివారం 05 ఏప్రియల్ 2026

# చెన్నూరులో రౌడీ రాజకీయాలకు తావులేదు



- క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికపై మంత్రి ఘాటు స్పందన
- హింసను ప్రోత్సహిస్తే ఊరుకోం.. బాల్క సుమన్‌కు గట్టి హెచ్చరిక
- ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరగడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
- అభివృద్ధిలో క్యాతనపల్లి మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్న మంత్రి

**నేటి సాక్షి, మంచిర్యాల (శ్రీధర్ దమ్ము):** క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల సందర్భంగా జరిగిన పరిణామాలపై రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తీవ్రంగా స్పందించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చెన్నూరు నియోజకవర్గంలో హింసను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను హెచ్చరించారు. గత ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పినా సుమన్ వ్యవహార శైలిలో మార్పు రాలేదని, మళ్లీ పాత పద్ధతుల్లోనే వ్యవహరిస్తే ప్రజలే బుద్ధి చెబుతారని మండిపడ్డారు. క్యాతనపల్లి ఎన్నికలు సజావుగా సాగేందుకు తాము మొదటి నుంచి సహకరించామని, కానీ బాల్క సుమన్ మరియు బిఆర్ఎస్ నేతలు రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్ పార్టీని బదనాం చేసేందుకు ప్రయత్నించారని మంత్రి విమర్శించారు. ఈ క్రమంలోనే తమ కాన్వాయ్‌పై దాడికి పాల్పడటం అప్రజాస్వామికమని ధ్వజమెత్తారు. గతంలో బెదిరింపులతో ఏకగ్రీవాలు చేసుకున్న చరిత్ర సుమన్‌ది అని, తాము అలాంటి రౌడీ రాజకీయాలు చేయబోమని స్పష్టం చేశారు. ఎన్నికైన క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లకు మంత్రి తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. క్యాతనపల్లి మున్సిపాలిటీతో పాటు చెన్నూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని భరోసా ఇచ్చారు. ప్రజాస్వామ్యానికి అర్థం ఉండేలా, పారదర్శకమైన పాలన అందిస్తామని ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి పునరుద్ఘాటించారు.

# విద్యార్థి మృతి ఘటనపై ఎక్స్‌గ్రేషియా






**నేటి సాక్షి:** కోసిగి ఆర్టీసీ బస్సు కిందపడి విద్యార్థి కంపాటి నరసింహులు మృతి చెందిన ఘటనపై ఏఐఎస్ఎఫ్ నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన అత్యంత దురదృష్టకరమని పేర్కొంటూ, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం మరియు ఆర్టీసీ యాజమాన్యం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం మృతుడి నివాసానికి వెళ్లిన ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యస్. ఈరేష్, మహిళా కన్వీనర్ అఖిలతో పాటు నాయకులు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడి తల్లిదండ్రులు వెంకటలక్ష్మి, శ్రీనివాసులు మరియు కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నిరుపేద కుటుంబానికి చెందిన నరసింహులు అకాల మరణం ఆ కుటుంబానికి తీరని లోటని అన్నారు. ప్రస్తుతం ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. మృతుడి కుటుంబానికి తక్షణమే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, కుటుంబంలో చదువుకుంటున్న మరో విద్యార్థికి ఆర్టీసీలో ఉద్యోగం కల్పించి భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఇలాంటి ప్రమాదాలు మళ్లీ జరగకుండా విద్యాసంస్థల వద్ద, టర్నింగ్ క్రాసుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, రద్దీ ప్రాంతాల్లో బస్సుల వేగాన్ని నియంత్రించి కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం ఈ విషయంపై సానుకూలంగా స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయకపోతే, విద్యార్థి లోకాన్ని ఏకం చేసి జిల్లా వ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు ఆకాష్, శివ, చరణ్, హరీష్, రాకేష్, తరుణ్, మల్లిఖార్జున, వినోద్, అఖిల్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

# సింధనూరులో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ





- ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రులు నారా లోకేష్, కుమారస్వామి, సంజయ్ సేథ్
- కేంద్ర, రాష్ట్ర మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపిన రాఘవేంద్ర రెడ్డి

**నేటి సాక్షి, సింధనూరు:** కర్ణాటక రాష్ట్రంలోని సింధనూరులో శనివారం సైనిక్ స్కూల్ ప్రారంభోత్సవం మరియు విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాలకు ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, కేంద్ర ఉక్కు మరియు భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి, కేంద్ర రక్షణశాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రాలయం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి కార్యక్రమానికి విచ్చేసిన కేంద్ర, రాష్ట్ర మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం వారితో భేటీ అయి, ఇంతటి బృహత్తర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడంపై తన అభినందనలు తెలియజేశారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక అయిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం మరియు విద్యా రంగానికి మేలు చేసేలా సైనిక్ స్కూల్ ప్రారంభించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# శవ రాజకీయాల కోసమే బిఆర్ఎస్ ఆరాటం

గుమ్మడి సోమయ్య

**నేటి సాక్షి, ములుగు జిల్లా:** తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క సారక్క ఆలయం వద్ద జరిగిన యాదృచ్ఛిక ప్రమాదాన్ని పాలకులకు అంటగట్టే నీచమైన బుద్ధిని బిఆర్ఎస్ నాయకులు మార్చుకోవాలని తెలంగాణ పంచాయతీ రాజ్ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య హితవు పలికారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ప్రమాదంలో గాయపడిన చిన్నారిని చూసి కంటతడి పెట్టాల్సింది పోయి, కేవలం పార్టీ ఉనికి కోసం, రాజకీయ స్వలాభం కోసం సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తూ కృత్రిమ ఆనందం పొందడం సిగ్గుచేటని మండిపడ్డారు. మంత్రి సీతక్కపై రూ. 200 కోట్ల అవినీతి ఆరోపణలు చేస్తున్న బిఆర్ఎస్ నాయకుడు సతీష్ రెడ్డికి అసలు సోయి ఉండి మాట్లాడుతున్నారా అని ప్రశ్నించారు. రూ. 201 కోట్ల పనుల్లో రూ. 200 కోట్లు ఎలా దోచుకుంటారో చెప్పాలని, నిజంగా చిత్తశుద్ధి ఉంటే సమ్మక్క సారలమ్మ సన్నిధిలో నిజనిజాల పైన చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు. గతంలో కూడా బిఆర్ఎస్ శవ రాజకీయాలు చేసిందని, ఇప్పుడు కూడా అదే పంథాను కొనసాగిస్తూ ప్రభుత్వంపై బురద జల్లుతోందని ధ్వజమెత్తారు. తప్పుడు ప్రచారాలు చేస్తున్నందుకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో తెలంగాణ ప్రజలే తగిన బుద్ధి చెబుతారని గుమ్మడి సోమయ్య హెచ్చరించారు.



## క్యాతనపల్లి మున్సిపల్ పాలకవర్గం ఎన్నిక

జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య



**నేటి సాక్షి,మంచిర్యాల:** మున్సిపల్ సాధారణ ఎన్నికల నేపథ్యంలో క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ల పరోక్ష ఎన్నికలు నిర్వహించడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. శనివారం క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో జరిగిన ఎన్నిక కార్యక్రమానికి బెల్లంపల్లి సబ్ కలెక్టర్, ఎన్నికల పరిశీలకులు మనోజ్, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ పాలకవర్గం పరీక్ష ఎన్నికకు ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండేందుకు ప్రత్యక్ష ప్రసారం ఏర్పాట్లు చేయడం జరిగిందని, ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు. క్యాతనపల్లి మున్సిపల్ చైర్ పర్సన్‌గా గొడిసెల సంధ్యారాణి, వైస్ చైర్ పర్సన్‌గా మిట్టపెల్లి సరిత లను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు

## ప్రాథమిక పాఠశాల ఆదర్శనీయం

మండల విద్యాధికారి ప్రభాకర్



**నేటి సాక్షి, ధర్మారం:** ప్రకాష్ నగర్ ప్రాథమిక పాఠశాల విద్యాభివృద్ధిలో ఆదర్శనీయంగా నిలుస్తుందని మండల విద్యాధికారి పోతు ప్రభాకర్ కొనియాడారు. శనివారం ధర్మారం మండలం ప్రకాష్ నగర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించిన వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ పాఠశాల గత విద్యాసంవత్సరం జిల్లా స్థాయిలో ఛాంపియన్‌గా నిలిచి ప్రశంసలు పొందిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ విద్యాసంవత్సరం కూడా ఎఫ్.ఎల్.ఎన్ (ఖీంచీ) సామర్థ్యాల్లో 90 శాతం మంది విద్యార్థులను తీర్చిదిద్దడం ఇక్కడి ఉపాధ్యాయుల కృషి ఫలితమేనని అభినందించారు. పాఠశాలలోని 20 మంది విద్యార్థుల్లో అన్ని విద్యా సామర్థ్యాలు సాధించిన 15 మంది విద్యార్థులకు ఎంఈఓ చేతుల మీదుగా మెమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చిదురాల భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయిని స్వరూప, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ సరిత, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ ఎదుల్ల ప్రేమ్ సాగర్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ గజ్జెల సునీత, వార్డు మెంబర్ మాతంగి సమత, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శంకర్ పల్లి ఆలయంలో దొంగతనం



**నేటి సాక్షి, శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి పట్టణంలోని మున్సిపల్ హనుమాన్ నగర్ పరిధిలో గల శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు. ఆలయ పూజారి శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం మధ్యాహ్నం పూజలు ముగించుకుని ఆలయానికి తాళం వేసి వెళ్లగా, శనివారం తెల్లవారుజామున 4:40 గంటల సమయంలో స్థానికులు ఫోన్ చేసి దొంగతనం జరిగినట్లు సమాచారం అందించారు. పూజారి తక్షణమే ఆలయానికి చేరుకుని చూడగా, బీరువా తాళాలు పగలగొట్టి ఉన్నాయి. అందులో ఉన్న పంచలోహాలతో చేసిన అమ్మవారి విగ్రహం, శతగోపం మరియు సుమారు 3,000 రూపాయల నగదును దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఈ విషయంపై సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. పట్టణంలోని ఆలయాల్లో దొంగతనం జరగడంతో స్థానిక భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## అసత్య ప్రచారాలు మానుకో సతీష్ రెడ్డి



**నేటి సాక్షి, ములుగు:** తాడ్వాయి మండలం మేడారంలో జరిగిన బాలుడి ప్రమాద ఘటనను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం బీఆర్ఎస్ నాయకుల దివాళాకోరుతనానికి నిదర్శనమని తాడ్వాయి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు మండిపడ్డారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ప్రమాదానికి గురైన మేడారం పూజారి కుమారుడు వివన్ కుటుంబానికి అండగా నిలిచి, ఆసుపత్రి ఖర్చుల బాధ్యతను తీసుకున్న మంత్రి సీతక్క సేవాభావాన్ని ప్రజలందరూ గమనిస్తున్నారని తెలిపారు. అధికారం కోల్పోయిన అసహనంతో రెడ్కో మాజీ చైర్మన్ ఏరువా సతీష్ రెడ్డి వాస్తవాలను వక్రీకరించి అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పదేళ్ల అధికారంలో ములుగు ప్రాంతానికి బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి ఏమిటో సతీష్ రెడ్డి చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మేడారానికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తీసుకువచ్చిన మంత్రి సీతక్కపై నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదని హితవు పలికారు. జంపన్న వాగు ఉధృతంగా ప్రవహించి ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు కనిపించని నాయకులు, ఇప్పుడు యాదృచ్ఛికంగా జరిగిన ఘటనపై చిల్లర రాజకీయాలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ఇప్పటికైనా వ్యక్తిగత విమర్శలు మానుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, లేనిపక్షంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు హెచ్చరించారు.

# కాంగ్రెస్ నాయకుల విమర్శలు

## అభద్రతా భావానికి నిదర్శనం కొమరం ధనలక్ష్మి



**నేటి సాక్షి ములుగు జిల్లా:** తాడ్వాయి మండలం మేడారంలో ప్రమాదానికి గురైన సమ్మక్క పూజారి సిద్ధబోయిన రమేష్ కుమారుడి కుటుంబాన్ని మానవతా దృక్పథంతో పరామర్శించిన బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబుపై కాంగ్రెస్ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని ములుగు జిల్లా బిఆర్ఎస్ మహిళా నాయకురాలు కొమరం ధనలక్ష్మి మండిపడ్డారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. జాతర పనుల లోపం కారణంగా ఒక పసివాడికి అంగవైకల్యం ఏర్పడితే, పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ కుటుంబానికి లక్ష్మణ్ బాబు అండగా నిలిచారని, దీనిని కూడా రాజకీయం చేయడం కాంగ్రెస్ నాయకుల దివాళాకోరుతనానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. జిల్లాలోని అన్ని మండలాల్లో పర్యటిస్తూ ఆపదలో ఉన్న నిరుపేదలకు ఆర్థిక సాయం అందిస్తున్న లక్ష్మణ్ బాబుకు పెరుగుతున్న ప్రజాదరణను చూసి కాంగ్రెస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని ఆమె విమర్శించారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ పడిపోతుందనే భయంతోనే ఇలాంటి అభద్రతా భావానికి గురవుతున్నారని ఎద్దేవా చేశారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై దృష్టి పెట్టకుండా కేవలం విమర్శల కోసమే విమర్శలు చేస్తే భవిష్యత్తులో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని కొమరం ధనలక్ష్మి హెచ్చరించారు.

# లారీని ఢీకొన్న బైక్

## ఇద్దరు యువకుల మృతి



**నేటి సాక్షి, మేడిపల్లి:** మేడిపల్లి మండల కేంద్రం శివారులోని మోహన్ రావు పేట బ్రిడ్జి సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. జాతీయ రహదారిపై ఎటువంటి సంకేతాలు లేకుండా నిలిపి ఉంచిన లారీని, వేగంగా వచ్చిన పల్సర్ బైక్ వెనుక నుండి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న పెగడపల్లి మండలం ఆరవెల్లి గ్రామానికి చెందిన గాలిపెల్లి ఆదిత్య (21), వెనుక కూర్చున్న మహారాష్ట్రకు చెందిన విగ్నేష్ (17) అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు ఆదిత్య తల్లి అనురాధ ఫిర్యాదు మేరకు, రోడ్డుపై నిర్లక్ష్యంగా లారీని నిలిపిన డ్రైవర్ తిరుపతిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కోరుట్ల సీఐ సురేష్ బాబు ఆధ్వర్యంలో మేడిపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

# రెచ్చిపోతున్న మట్టి మాఫియా

## హరితహారం చెట్లు ధ్వంసం



**నేటి సాక్షి గన్నేరువరం,(బుర్ర అంజయ్య గౌడ్):** మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామ శివారులో వరద కాలువ వద్ద హరితహారం లో పెంచిన చెట్లు శుక్రవారం ధంసం అయ్యాయని పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని ప్రభుత్వం మొక్కలు నాటించి వాటి సంరక్షణ లక్షల్లో నిధులు వెచ్చిస్తుంటే గ్రామంలో కొంత మంది మట్టి మాఫియా నిర్వహించే వ్యక్తులు జెసిబి లో సహాయంతో వరద కాలువ మట్టిని తరలిస్తూ అడ్డంగా చెట్లు ఉన్నాయని తలచి విచక్షణ రైతంగా హరితహారం చెట్లను నిర్లక్ష్యప్తంగా ధ్వంసం చేస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు ఒకవైపు గ్రామ అధికారులు పచ్చదనం ఆవశ్యకతను గ్రామసభల్లో వేరుస్తూ మొక్కల సంరక్షణ చేపట్టాలని సూచిస్తున్నప్పటికీ ఈ విధమైన మొక్కల చెట్లు ధ్వంసం కొనసాగుతుంది హరితహారం మొక్కలు ధ్వంసానికి కారణమైన వ్యక్తులపై గ్రామ మండల అధికారులు ఏ విధమైన చర్యలు తీసుకుంటారో చూడాలి

# మంత్రి అడ్లూరితో సర్పంచుల భేటీ

## మండల అభివృద్ధిపై చర్చ



**నేటి సాక్షి, ఎండపల్లి:** ఎండపల్లి మండలానికి చెందిన సర్పంచులు శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలో నూతన ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం, పంచాయతీల అభివృద్ధికి నిధుల కేటాయింపు మరియు గ్రామీణ ప్రాంతాల్లోని మౌలిక వసతుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా గ్రామాల్లో సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని సర్పంచులు వివరించారు. సర్పంచుల విన్నపాలపై సానుకూలంగా స్పందించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమం మరియు గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొనుగోటి శ్రీనివాసరావు, మద్దుల గోపాల్ రెడ్డి, గూడ రాంరెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు సంఘ రమేష్ యాదవ్ మరియు మండలంలోని పలువురు సర్పంచులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# కౌతాళం జెడ్పీ హైస్కూల్‌లో క్రీడా, సాంస్కృతిక వారోత్సవాలు





**నేటి సాక్షి, కౌతాళం:** కౌతాళం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న క్రీడా మరియు సాంస్కృతిక వారోత్సవాలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ రెడ్డి ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి కౌతాళం సొసైటీ చైర్మన్ అల్లూరి వెంకటపతి రాజు, టీడీపీ టౌన్ అధ్యక్షులు డాక్టర్ నీలి రాజనంద్, స్కూల్ కమిటీ చైర్మన్ బసవరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడా మరియు సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, సృజనాత్మకత మరియు నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. చదువుతో పాటు ఇటువంటి ఉత్సవాలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి దోహదపడతాయని, జిల్లా మరియు రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచేందుకు ఇవి ఎంతో ప్రోత్సాహాన్నిస్తాయని తెలిపారు. ఆరోగ్యకరమైన పోటీ తత్వాన్ని పెంపొందించడంలో ఈ వారోత్సవాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని వారు వివరించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా మెమెంటోలు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు సిబ్బంది ముఖ్య అతిథులను శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# అధికారం అండతో అరాచకాలు చేస్తే ప్రజలు క్షమించరు

- కేసీఆర్ క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడిని తీవ్రంగా ఖండించిన ములుగు జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు
- లేభివృద్ధిని చూపి గెలవాల్సింది పోయి భౌతిక దాడులకు పాల్పడటం కాంగ్రెస్ దివాళాకోరుతనం



**నేటి సాక్షి, ములుగు జిల్లా:** తెలంగాణ రాష్ట్ర సాధకుడు, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణులు జరిపిన దాడిని ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం ఆయన ములుగులో మీడియాతో మాట్లాడుతూ.. అధికారం అండతో అరాచకాలకు పాల్పడటం కాంగ్రెస్ నైజమని మండిపడ్డారు. అభివృద్ధిని చూపి ప్రజల మనసు గెలవాల్సింది పోయి, భౌతిక దాడులతో ప్రతిపక్షాల గొంతు నొక్కాలనుకోవడం కాంగ్రెస్ దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ అంటే కేవలం ఒక వ్యక్తి కాదని, ఒక వ్యవస్థ అని లక్ష్మణ్ బాబు పేర్కొన్నారు. తెలంగాణ కోసం చావు నోట్లో తలపెట్టిన ధీశాలి కార్యాలయంపై రాళ్లు వేసి భయపెట్టాలనుకోవడం కాంగ్రెస్ నాయకుల అవివేకమే అవుతుందని ఎద్దేవా చేశారు. దాడులు చేసే కొద్దీ బిఆర్ఎస్ పార్టీ మరింత ఉధృతంగా పోరాడుతుందే తప్ప వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేక, ప్రజల దృష్టిని మరల్చడానికే ఇలాంటి దాడులకు తెరలేపుతున్నారని ఆరోపించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ఇప్పుడు కాంగ్రెస్ చేస్తున్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని లక్ష్మణ్ బాబు హెచ్చరించారు. సమయం వచ్చినప్పుడు ఈ దాడులకు రెట్టింపు స్థాయిలో ప్రజలే బుద్ధి చెబుతారని తెలిపారు. తక్షణమే ఇలాంటి అప్రజాస్వామిక చర్యలను ఆపాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా బిఆర్ఎస్ శ్రేణులు ప్రజాక్షేత్రంలో గట్టిగా సమాధానం చెబుతాయని ఆయన స్పష్టం చేశారు.

# చందిప్పలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



- సర్పంచ్ మల్లికార్జున ఆధ్వర్యంలో కొత్త కాలనీలో ఘనంగా శంకుస్థాపన
- చినుకు పడితే చిత్తడి పరిస్థితికి ముగింపు.. హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

**నేటి సాక్షి, శంకర్‌పల్లి :** శంకర్‌పల్లి మండలం చందిప్ప గ్రామంలోని కొత్త కాలనీలో గత 11 సంవత్సరాలుగా నెలకొన్న రహదారి సమస్య పరిష్కారం దిశగా కీలక అడుగు పడింది. శనివారం గ్రామ సర్పంచ్ మల్లికార్జున ఆధ్వర్యంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఘనంగా శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న మౌలిక వసతి పనులు ప్రారంభం కావడంతో కాలనీవాసులు స్వచ్ఛందంగా తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కొత్త కాలనీలో సరైన రహదారి లేక దశాబ్ద కాలంగా ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో "చినుకు పడితే చిత్తడి" అన్నట్లుగా రోడ్లన్నీ బురదమయమై నడవలేని స్థితి ఉండేదని, పాఠశాల విద్యార్థులు, వృద్ధులు తరచుగా జారిపడి గాయపడేవారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు రావడానికి కూడా వీలులేని పరిస్థితి ఉండేదని, ఇప్పుడు రోడ్డు పనులు ప్రారంభం కావడంతో తమ కష్టాలు తీరనున్నాయని కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మల్లికార్జున మాట్లాడుతూ.. ప్రజల అవసరాలే తమకు ప్రథమ ప్రాధాన్యత అని, గ్రామంలోని ప్రతి వార్డులో మౌలిక వసతుల మెరుగుదలకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. 11 ఏళ్ల సమస్యను గుర్తించి, ప్రత్యేక చొరవతో నిధులు కేటాయించి పనులు ప్రారంభించామని తెలిపారు. ఉప సర్పంచ్, వార్డు సభ్యుల సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు మరియు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామీణ విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించడం గర్వకారణం





**నేటి సాక్షి, పాములపాడు :** నంద్యాల జిల్లా పాములపాడులోని శ్రీ వివేకానంద హైస్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరిచి మండలానికి గర్వకారణంగా నిలిచారు. హైదరాబాద్‌కు చెందిన ఎం ఐ ఛాంపియన్ ఇండియా సంస్థ నిర్వహించిన ఆల్ ఇండియా సైన్స్, మ్యాథ్స్, ఇంగ్లీష్ చాలెంజింగ్ ఎగ్జామ్స్‌లో ఈ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో 4వ ర్యాంక్ నుండి 9వ ర్యాంక్ వరకు కైవసం చేసుకున్నారు. శనివారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన అభినందన సభకు మండల తహసీల్దార్ సుభద్రమ్మ, మండల విద్యాధికారిణి సుభాషిణి ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా గ్రామీణ ప్రాంత విద్యార్థులు జాతీయ స్థాయి ర్యాంకులు సాధించడం అభినందనీయమని ప్రశంసించారు. ఈ పోటీ పరీక్షల్లో 6 నుండి 10వ తరగతి వరకు మొత్తం 70 మంది విద్యార్థులు పాల్గొనగా, అందులో 32 మంది విద్యార్థులు ఏకంగా 44 జాతీయ స్థాయి పతకాలు సాధించడం విశేషం. ఇందులో 24 గోల్డ్, 13 సిల్వర్, 6 బ్రాంజ్ మెడల్స్ ఉన్నాయి. ముఖ్యంగా పదవ తరగతి విద్యార్థిని ఉమాశ్రీ మూడు విభాగాల్లోనూ గోల్డ్ మెడల్స్ సాధించగా, అనీషా రెండు గోల్డ్ మెడల్స్ గెలుచుకుంది. అయ్యాజ్ అలీ, శృతి, విష్ణువర్ధన్ తదితర విద్యార్థులు కూడా తమ ప్రతిభను చాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఆర్.ఎస్.ఆర్ గోపాల్, డైరెక్టర్ దేవిక, స్థానిక నాయకులు పుల్లన్న యాదవ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# కేసీఆర్ క్యాంప్ కార్యాలయంపై దాడి అప్రజాస్వామికం



**నేటి సాక్షి, జగదేవపూర్ :** గజ్వేల్‌లోని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ క్యాంప్ కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణులు జరిపిన దాడిని బీఆర్ఎస్ యువ నేత నరపాక పరశురామ్ తీవ్రంగా ఖండించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. కార్యాలయంలోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేసి, బలవంతంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటోను పెట్టడం కాంగ్రెస్ నాయకుల అహంకారానికి, రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. రాజకీయంగా ఎదుర్కోలేక ఇలాంటి నీచమైన దాడులకు దిగడం సిగ్గుచేటని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధకుడి కార్యాలయంపై దాడి చేయడం అంటే తెలంగాణ ఆత్మగౌరవంపై దాడి చేయడమేనని పరశురామ్ పేర్కొన్నారు. ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించాలి తప్ప, ఇలా గూండాగిరితో భయపెట్టలేరని హితవు పలికారు. అల్లరి మూకలను ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్ నాయకత్వ తీరును తెలంగాణ సమాజం గమనిస్తోందని, భవిష్యత్తులో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# బడ్జెట్ ఫలాలు సామాన్యులకు చేరడమే ప్రభుత్వ లక్ష్యం

## ఎమ్మెల్యే గిత్త జయసూర్య




**నేటి సాక్షి, నంద్యాల:** నంద్యాలలో నిర్వహించిన "బడ్జెట్ 2026-27 అవుట్‌రీచ్" కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తో కలిసి నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బడ్జెట్‌లో కేటాయించే ప్రతి రూపాయిని పారదర్శకంగా, స్పష్టమైన ప్రణాళికతో ఖర్చు చేయాలని అధికారులను ఆదేశించారు. గతంలో ఆగిపోయిన సుమారు 85 కేంద్ర పథకాలను తిరిగి ప్రారంభించామని, కేంద్రం నుండి రావాల్సిన నిధులను వదలకుండా ఫాలో-అప్ చేసేందుకు ఢిల్లీలో ప్రత్యేక నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆశయాలు ప్రతి ఇంటికి చేరేలా, సంక్షేమ కార్యక్రమాల అమలును వేగవంతం చేయడమే ఈ అవుట్‌రీచ్ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. బడ్జెట్‌లోని ముఖ్యాంశాలపై జిల్లా మరియు మండల స్థాయి అధికారులకు, ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఇతర ప్రజాప్రతినిధులు మరియు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా మహనీయుల జయంతి వారోత్సవాలు

## డాక్టర్ హరిప్రసాద్



**నేటి సాక్షి, పాములపాడు:** పాములపాడులో ఛత్రపతి శివాజీ మహారాజ్, మహాత్మా జ్యోతిబాపూలే మరియు బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వారోత్సవాల వాల్ పోస్టర్‌ను శనివారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ.. నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ, హక్కులు మహనీయుల పోరాట ఫలితమేనని కొనియాడారు. వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. 2026 ఏప్రిల్ 8 నుండి 14వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ఈ వారోత్సవాలను నిర్వహించాలని సమితి నిర్ణయించినట్లు తెలిపారు. ఏప్రిల్ 8న శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా కర్నూలులో భారీ ర్యాలీ, ఏప్రిల్ 11న జ్యోతిబాపూలే జయంతిని పురస్కరించుకొని పూలే సినిమా ప్రదర్శన, ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా పాత బస్టాండ్ నుండి యునాని హాస్పిటల్ వరకు ర్యాలీ మరియు బహిరంగ సభలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్.టి.ఐ జయన్న, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు అంకన్న, జిల్లా కన్వీనర్ ఎం. నాగరాజు, సిపిఐ ప్రసాద్, బిసి సంఘాల నాయకులు సాయికృష్ణ, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు. భావితరాలకు మహనీయుల త్యాగాలను చాటి చెప్పడమే ఈ ఉత్సవాల ప్రధాన ఉద్దేశమని వారు పేర్కొన్నారు.

# యుద్ధం వొద్దు...శాంతి కోసం చర్చలు జరపండి




- మిర్యాలగూడలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

**నేటిసాక్షి, మిర్యాలగూడ :** అమెరికా-ఇజ్రాయిల్ కలిపి ఇరాన్ పై చేస్తున్న ప్రజాస్వామికి యుద్ధాన్ని వెంటనే ఆపేయాలని శనివారం మిర్యాలగూడ పట్టణంలో భారీ సంఖ్యలో వివిధ ప్రజా సంఘాలు, సామాజికవేత్తలు, వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో అమరవీరుల స్థూపం వద్ద నుండి రాజీవ్ చౌకు వరకు, అక్కడి నుండి తిరిగి అమరవీరుల వద్దకు నిర్వహించారు. అనంతరం స్థూపం బీసం రామయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభా కార్యక్రమాన్ని నిర్వహించారు. సందర్భంగా స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, యుద్ధాన్ని ఆపి వెంటనే శాంతి చర్చలు కొనసాగించాలని, కాంగ్రెస్ పార్టీ వైపు నుంచి కోరుకుంటున్నామని తెలిపారు. అనంతరం జన విజ్ఞాన వేదిక జాతీయ కన్వీనర్ ముప్వా రామారావు మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో యుద్ధాలు ప్రపంచవ్యాప్తంగా ప్రభావితం చేస్తాయని, యుద్ధం వల్ల ఏ దేశం కూడా అభివృద్ధి చెందజాలదని అన్నారు. మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ, యుద్ధాన్ని ఆపడానికి భారతదేశ ప్రభుత్వం కూడా కృషి చేయాలని, లేకపోతే సామాన్య ప్రజలు ఇబ్బందులు పడవలసి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కస్తూరి ప్రభాకర్, సత్యనారాయణ రావ్, మౌసమ్ హుస్సేన్, ముస్లిం మైనార్టీ నాయకులు, విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు అంబటి నాగయ్య, జాడి రాజు,జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుకూరి సుదర్శన్, సామాజిక వేత్త కిరణ్మయి, ఉదయ, యుటిఎఫ్ నాయకులు బక్క శ్రీనివాసచారి, మాల మహానాడు జాతీయ అధ్యక్షులు తాళ్లపల్లి రవి, స్వామి, డివైఎఫ్ఐ నాయకులు రవి నాయక్, హరికృష్ణ, హఫీజ్, దశరథ నాయక్, వెంకటేశ్వర్లు వివిధ ప్రజాసంఘాల నేతలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఇది ఇందిరమ్మ రాజ్యం కాదు.. రేవంత్ గూండా రాజ్యం

## హరీశ్ రావు ధ్వజం

**నేటి సాక్షి, గజ్వేల్:** గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణులు జరిపిన దాడిని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. ఈ దాడి ముమ్మాటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కనుసన్నల్లోనే జరిగిందని, ఇది ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని ఆయన అభివర్ణించారు. అధికార మదంతో కాంగ్రెస్ నాయకులు పట్టపగలే దౌర్జన్యాలకు తెగబడుతుంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నాయా లేదా అన్న అనుమానం కలుగుతోందని మండిపడ్డారు. పోలీసు యంత్రాంగం అధికార పార్టీకి ప్రైవేట్ సైన్యంలా మారి ప్రేక్షక పాత్ర వహించడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు ఇందిరమ్మ రాజ్యం అంటూనే, మరోవైపు ప్రతిపక్షాల గొంతు నొక్కుతూ గూండా రాజ్యాన్ని నడుపుతున్నారని హరీశ్ రావు విమర్శించారు. ముఖ్యమంత్రి, మంత్రులు ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో నిమగ్నమై తెలంగాణ పాలనను గాలికి వదిలేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ఇలాంటి అణచివేతలకు భయపడబోరని, ప్రజాక్షేత్రంలో ప్రభుత్వాన్ని అడుగడుగునా నిలదీస్తామని హెచ్చరించారు. క్యాంపు కార్యాలయంపై దాడికి పాల్పడిన వారిని వెంటనే గుర్తించి అరెస్ట్ చేయాలని రాష్ట్ర డీజీపీని ఆయన డిమాండ్ చేశారు.



# ఘనంగా భారత్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల వార్షికోత్సవం







**నేటి సాక్షి, మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణంలోని భారత్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల వార్షికోత్సవ వేడుకలు శనివారం కరస్పాండెంట్ మహమ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో అట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, కౌన్సిలర్ బంటు శ్రీను మరియు ప్రముఖ నటుడు, సామాజికవేత్త మూసా అలీ ఖాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు నైతిక విలువలను పెంపొందించుకుని దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. పాఠశాల యాజమాన్యం విద్యాబోధనలో చూపిస్తున్న చొరవను వారు అభినందించారు. ఈ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రంగనాథ ఆలయంలో పూజలు

## నందికొట్కూరు టీడీపీ ఇంచార్జ్ మాండ్ర, ఎమ్మెల్యే, గిత్త



**నేటి సాక్షి,నందికొట్కూరు:** నందికొట్కూరు నియోజకవర్గం జూపాడుబంగ్లా మండలం తర్తూరు గ్రామంలో శ్రీ లక్ష్మి సమేత శ్రీ శ్రీ శ్రీ రంగనాథ స్వామి తిరుణాల పురస్కరించుకొని ప్రత్యేక పూజలతో దర్శించుకున్న నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జ్ శ్రీ మాండ్ర శివానందరెడ్డి గారు నందికొట్కూరు శాసనసభ్యులు శ్రీ గిత్త జయసూర్య. అనంతరం రంగనాథ స్వామి ఆలయ కమిటీ వాళ్లు ఏర్పాటుచేసిన రాష్ట్రస్థాయి ఎద్దుల పెద్దబండ పోటీలను ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించిన నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జి శ్రీ మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు శాసనసభ్యులు శ్రీ గిత్త జయసూర్య. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని కూటమి మండల నాయకులు మహిళ నాయకురాలు గ్రామ ప్రజలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వేంకటేశ్వర స్వామి వార్షికోత్సవం



**నేటి సాక్షి, జగదేవపూర్:** జగదేవపూర్ పట్టణంలోని శ్రీ శ్రీ వేంకటేశ్వర స్వామి 40వ వార్షికోత్సవ వేడుకలు శనివారం వేద మంత్రోచ్చారణల మధ్య అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో భాగంగా ఆలయాన్ని పూలమాలలు, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. సాయంత్రం గజ్వేల్ నియోజకవర్గ నాయకులు, ఎఫ్.డి.సి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ గణేష్, మాజీ ఎంపీటీసీ కవితా శ్రీనివాస్ రెడ్డి, నాచారం మాజీ డైరెక్టర్ బుద్ధ నాగరాజుతో పాటు ఆర్యవైశ్య మండల కమిటీ సభ్యులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు మరియు స్థానిక నాయకులు ఉత్సవాల నిర్వహణను పర్యవేక్షించారు.

# కలెక్టర్‌ను కలిసిన దంపతులు

## మండల సమస్యలపై వినతి




**నేటి సాక్షి, కర్నూలు:** పెద్దకడబూరు మండలంలో నెలకొన్న వివిధ ప్రజా సమస్యలపై టిడిపి రాష్ట్ర రైతు ప్రతినిధి నరవ రామకాంత్ రెడ్డి, కర్నూలు జిల్లా టిడిపి అధికార ప్రతినిధి నరవ శశిరేఖ శనివారం జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మండలంలోని గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి కొరత, తాగునీటి ఎద్దడి, ధ్వంసమైన రహదారులు మరియు విద్యుత్ సరఫరాలో అంతరాయం వంటి కీలక అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల వర్షాభావం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారికి తక్షణమే ప్రభుత్వ సహాయం అందేలా చూడాలని వారు కోరారు. పంటలకు మద్దతు ధర కల్పించడంతో పాటు, ఎరువులు, విత్తనాల సరఫరా సకాలంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ విషయాలపై సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నరవ దంపతులు తెలిపారు.

# అర్హులైన పేదలకే రేషన్ కార్డులు




**నేటి సాక్షి, నల్లగొండ :** ప్రభుత్వం అందజేస్తున్న తెల్ల రేషన్ కార్డులు, అంత్యోదయ కార్డులు అర్హులైన పేదలకు అందకుండా పోతున్నాయని భువనగిరి పార్లమెంట్ ఇన్చార్జి కత్తుల కాన్షీరామ్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. వందల ఎకరాల భూములు, కోట్ల ఆస్తులు మరియు రాజకీయ అండదండలు ఉన్నవారు ఈ కార్డులను పొంది దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. ఇది నిజమైన పేదల హక్కులను దోచుకోవడమేనని, దేశ ఆర్థిక వ్యవస్థకు నష్టం కలిగించే చర్య అని ఆయన పేర్కొన్నారు. అంత్యోదయ కార్డులు అత్యంత నిరుపేదలకు మాత్రమే ఇవ్వాలని, కానీ ప్రస్తుతం రాజకీయ ప్రభావంతో అనర్హులు వీటిని కబ్జా చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పష్టమైన అర్హత ప్రమాణాలను అమలు చేసి, ప్రస్తుతం ఉన్న కార్డులపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పేదరిక రేఖకు దిగువన ఉన్న ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందేలా చూడాలని బీఎస్పీ తరపున ప్రభుత్వాన్ని కోరారు. సామాజిక న్యాయం జరగాలంటే అనర్హుల కార్డులను వెంటనే తొలగించాలని ఆయన పేర్కొన్నారు.